





ఓ..టర్న్ చేసింది!

రాష్ట్ర గతి మార్చిన.. తూర్పుగోదావరి

మన్మోహన్ సింగ్ మృతికి కలెక్టర్ సంతాపం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపట్ల జిల్లా కలెక్టర్ పి . ప్రశాంతి సంతాపం ప్రకటించారు. కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం మన్మోహన్ సింగ్ మృతి పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించారు. మన్మోహన్ సింగ్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ మాజీ ప్రధాని మనోహ్మన్ సింగ్ మృతి నేపథ్యంలో ఏడు రోజులు సంతాప దినాలుగా పాటించడం జరుగుతుందని చెప్పారు.

టీడీపీ సభ్యత్వాల నమోదులో గోపాలపురం ఫస్ట్

నల్లజర్ల,డిశంబరు27(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వాల నమోదులో జిల్లాలోనే గోపాలపురం నియోజకవర్గం ప్రథమస్థానంలో నిలిచినట్టు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు తెలిపారు.నల్లజర్ల పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ నిర్ధేశించిన 60వేల సభ్యత్వాలు పైబడి నియోజకవర్గంలో నమోదు చేయించామని చెప్పారు.టీడీపీ పట్ల ప్రజల్లో మరింత విశ్వాసం ఉందని నిరూపించినట్టు పేర్కొన్నారు. కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి విజయ సంకేతం తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్,యద్ధనపూడి బ్రహ్మరాజు,ద్వారకాతిరుమ అధ్యక్షుడు లంకా సత్యనారాయణ,నాయకులు కూచిపూడి ఉదయ భాస్కరరావు పాల్గొన్నారు

ఇసుక రీచ్ నిర్వాహకులదే పర్యవేక్షణ బాధ్యత

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇసుక రీచ్ నిర్వాహకులదే పర్యవేక్షణ బాధ్యత అని.. అక్రమ రవాణా చేస్తున్నవారిపై కేసులు వారే పెట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన ఇసుక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 17 ఓపెన్ రీచ్‌లలో 1,46,249 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉండగా ఇప్పటి వరకూ 47,755 మెట్రిక్ టన్నులు వినియోగించారన్నారు.మిగిలిన ఇసుక ఎంత ఉందో ఇరిగేషన్,మైన్స్, రెవెన్యూ, అధికారులు జాయింట్‌యాక్షన్ పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. చిడిపి -1, కాకరపర్రు-1, కుమారుదేవం 1,3, ములకల్లంక-1,2, కాటవరం ఓపెన్ రీచ్‌లలో నీరు ఉండడంపై జాయింట్ కమిటీ తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలన్నారు. డీసిల్టేషన్ ఎగువ ప్రాంతంలో ఇసుకతీతకు బోట్స్‌మెన్ సొసైటీలకు ముందస్తు అనుమతులు ఎందుకు ఇచ్చారో వివరణ ఇవ్వాలని ఇరిగేషన్ హెడ్‌వర్క్స్ ఈఈని ఆదేశించారు. దీనిపై ఉన్నత స్థాయి అధికారులకు నివేదిక పంపిస్తామని స్పష్టం చేశారు.పట్టా భూముల్లో 30 దరఖాస్తులకు ఎన్‌వోసీ జారీ చేశామన్నారు. జిల్లాలో కొత్తగా ఆరు ఓపెన్ రీచ్‌లను గుర్తించామని, వాటిని జీయో గ్రాఫికల్ సంఖ్య ఆధారంగా అందుబాటులోకి తేవాలన్నారు. సమావేశంలో జేసీ చిన్నరాముడు, ఏఎస్పీ మురళీకృష్ణ, ఆర్డీవోలు పాల్గొన్నారు.

ఏడాదికి 365 రోజులు.. నెలలు గడిచాయి.. వారాలు గడిచాయి.. ఇక రోజులే ఉన్నాయి.. అది కూడా 2024లో మిగిలింది మూడు రోజులే.. అంటే 72 గంటల్లో కొత్త ఏడాదిలో అడుగు పెట్టబోతున్నాం.. మరి 2024 ఏం చేసిందో తెలిస్తే.. ఒళ్లు గగుర్పొడుస్తోంది.. ఎందుకంటే చరిత్రకు సాక్ష్యం నిలిచింది.. ఎన్నో సమాధానంలేని ప్రశ్నలకు సమాధానమైంది..?

ఓటు ఏం చేయగలదు.. పచ్చనోటుకు అమ్ముడుపోతోంది.. అదేం చెబితే అదే చేస్తుంది.. పథకాలకు అమ్ముడుపోతోంది.. ఎవరు ఎక్కువ ఇస్తే వారి వైపు ఉంటుంది.. ఇది గత ఎన్నికల ముందు వరకూ ఉన్న అపోహ.. అయితే 2024 మాత్రం ఓటు ఏం చేయగలదో నిరూపించింది.. మరో 30 ఏళ్లు నేనే సీఎం అన్న జగన్‌ను ఎక్కడ కూర్చో పెట్టాలో అక్కడే కూర్చోబెట్టింది.. మాకేంటి అని ఐదేళ్లు విర్రవీగిన నాయకులదీ అదే పరిస్థితి.. ఓటు బలమేంటో చాటిచెప్పింది.. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఐదేళ్ల వైసీపీ అరాచకానికి నిలువునా ఓటుతో పాతరేశారు.. జిల్లా రాజకీయ చరిత్రలో మును పెన్నడూ లేని విధంగా కూటమికి మొత్తం 21కి 21 సీట్లు కట్టబెట్టారు. ఒకరకంగా చెప్పాలంటే 2024 ఏడాది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చేసింది. రాజకీయ స్థితిగతులను మలుపుతిప్పింది. తూర్పు గోదావరి జిల్లాలో 2024 సరికొత్త రాజకీయ ఉదయానికి నాందిపలికింది. పవన్ గాలిలో.. చంద్రుడి వెలుగులో ఫ్యాన్ తునాతునకలైంది.

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

2024.. మరో నాలుగు రోజుల్లో కాలగర్భంలో కలిసిపోబోతోంది.. మరో కొత్త సంఖ్య కాలగమనంలోకి అడుగుపెట్టబోతోంది.. కానీ గతించిపోతున్న 2024 ఏడాది మాత్రం చరిత్రను తిరగరాసింది. ఓటు విలువ చాటి చెప్పింది.మునుపెన్నడూ లేని విధంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పెను సంచలనాలకు కేంద్రబిందువుగా మారింది. రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేయడంలో కనివినీ ఎరుగని రీతిలో కీలకపాత్ర పోషించింది. రాష్ట్రంలో ఐదేళ్ల అరాచకానికి నిలువెత్తు పాతరవేసింది. తనదైన తీర్పుతో చారిత్రక సాక్ష్యంగా నిలిచింది.

ఓటు ఊచకోత..

2024 ఏడాది అంతా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రంగానే రాష్ట్ర రాజకీయాలు సాగాయి. ఈ సంవత్సరం ఐదేళ్ల వైసీపీ అరాచక ప్రభుత్వానికి పాతరేసేలా అటు ఓటర్లు, ఇటు టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు కలిసికట్టుగా ముందుకు సాగాయి. ప్రత్యర్థి పార్టీలే కాకుండా ఓట్లేసి గద్దెనెక్కించిన ప్రజలను సైతం వైసీపీ తన అహంకార,అరాచక పాలనతో వేధించడంతో ఓటర్లంతా కసిగా నిశ్శబ్ద యుద్ధం సాగించారు. అటు కూటమి పార్టీలు సైతం విభేదాలకు తావులేకుండా కలిసికట్టుగా ముందుకు సాగి చరిత్ర ఎరుగని భారీ విజయం సాధించాయి. వాస్తవానికి 2024, మేలో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది జనవరి నుంచే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకరేపాయి. ఈ ఏడాది జనవరి 26న పవన్ పొత్తులో భాగంగా తొలి జాబితా ప్రకటించారు. రాజానగరం, రాజోలు నియోజకవర్గాల్లో జనసేన పోటీ చేస్తుందని రాష్ట్రంలోనే తొలి రెండు సీట్లను ప్రకటించి వైసీపీపై రాజకీయ యుద్ధానికి నాంది పలికారు. అదేనెలలో టీడీపీ అధినేత చంద్రబాబు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎన్నికల శంఖారావం పూరించారు. ఉమ్మడి జిల్లాలో తునిలో ఏ పార్టీ విజయం సాధిస్తే ఆపార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందన్న సెంటిమెంట్‌కు కొనసాగింపు అన్నట్టు జనవరి 10న తుని నుంచి రా..కదలి రా..సభతో చంద్రబాబు తన ఎన్నికల శంఖారావం పూరించారు. జనవరి 23నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా అనేక నియోజకవర్గాల్లో చంద్రబాబు సతీమణి భువనేశ్వరి సుడిగాలి పర్యటనలతో ప్రచార స్పీడు పెంచారు. మరోపక్క జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిఠాపురం నుంచే పోటీ చేస్తున్నట్టు మార్చి 14న ప్రకటించారు. అప్పటినుంచి రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టి జిల్లాపైనే పడింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 19 అసెంబ్లీ సీట్లలో ఒక్కస్థానం కూడా వైసీపీకి రాకుండా చేసే బాధ్యత తనదని పవన్ కల్యాణ్ ప్రకటించడంతో రాజకీయ వేడి మరింత పెరిగింది. మార్చి 16న అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్, ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వెలువడడంతో ఉమ్మడి జిల్లాలో రాజకీయ కాక పెరిగిపోయింది. కూటమిలో ఏప్రిల్ రెండో వారం నాటికి అభ్యర్థుల లెక్క తేల్చేసి ఎన్నికల బరిలోకి దిగాయి. ఒకపక్క టీడీపీ అధినేత చంద్రబాబు.. మరో పక్క జనసేన అధినేత పవన్.. ఇంకోపక్క బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సుడిగాలి పర్యటనలతో హోరెత్తించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కూటమి సునామీ స్పీడుతో ఎన్నికల రణక్షేత్రంలో కదిలి జనచైతన్యాన్ని పెంచాయి.

ఫ్యాన్ రెక్కలు ముక్కలు..

ఐదేళ్ల అరాచకంతో విర్రవీగిన వైసీపీ ఈ ఏడాది జనవరి నుంచే జిల్లాలో చేదు జ్ఞాపకాలను మూటగట్టుకుంది. కాకినాడలో అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి నుంచి ఈ చివర తునిలో మంత్రి దాడిశెట్టి రాజా, రాజమహేంద్రవరంలో మంత్రి వేణు.. ఇలా ఒకరేంటి ఎవరికివారే ఐదేళ్లు అధికారం మత్తులో జిల్లాను జుర్రేశారు. వీరందరికి తోడు ఎంపీ మిథున్‌రెడ్డి కడప నుంచి వచ్చి జిల్లాపై సాగించిన పెత్తనం, అక్రమాలు,దందాలు, స్కామ్‌లు జిల్లా ప్రజల్లో వైసీపీపై అసహ్యం పుట్టించేలా చేశాయి.అప్పటికే పన్నుల మోత, ఛార్జీల వాత,రీసర్వే పేరుతో భూముల్లో మతలబులు, ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌తో ప్రజల ఆస్తులను లూటీచేసే ప్రయత్నాలతో ప్రజల్లో వైసీపీపై తీవ్ర వ్యతిరేకత పెంచేసింది.దీంతో కాకినాడలో జనవరి 3న జగన్ పర్యటించిన సమయంలోను ప్రజలెవరూ రాకుండా ఆ పార్టీ ఓటమిని ముందే ఖాయం చేసేశారు. ఆ తర్వాత ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత పేరుతో వారిని మార్చి కొత్తవారిని నిలబెట్టినా జనం ఆదరించలేదు. చివరకు పిఠాపురంలో పవన్‌ను ఓడించేందుకు అప్పటికప్పుడు ముద్రగడను పార్టీలోకి చేర్చుకోవడం, కడప నుంచి మిథున్‌రెడ్డి మనుషులను,వందలకోట్ల డబ్బును పంచినా ప్రజల ఛీత్కారం నుంచి వైసీపీ తప్పించుకోలేక పోయింది. చివరకు ముద్ర గడను సొంతకూతురే చీల్చిచెండాడంతో వైసీపీ మరింత పలుచన అయిపోయింది. చివరకు ఎన్నికల ఫలితాలతో ఫ్యాన్ రెక్కలు ముక్కలు ముక్కలయ్యాయి.అధికారం కోల్పోయిన తర్వాత వైసీపీకి క్యాడర్ కూడా ముఖం చాటేయడంతో 2024 ఆపార్టీకి పీడకలగా మారినట్లయింది.

ముద్రగడ పద్మనాభరెడ్డిగా.. ముద్రగడ పద్మనాభం

- 2024 ఎన్నికల్లో చిత్రవిచిత్రాలు జరిగాయి.. ఈ ఎన్నికల్లో ప్రధాన ఆకర్షణ ముద్రగడ పద్మనాభం. ఎన్నికల్లో వైసీపీ గెలవకపోతే పేరు మార్చుకుంటానని శపథం చేశారు. ఈ ఎన్నికలో ఘోరంగా ఓటమి పాలవడంతో ఆయన తన పేరును ముద్రగడ పద్మనాభరెడ్డిగా మార్చుకున్నారు.
- పి.గన్నవరంలో కూటమి అభ్యర్థిగా టీడీపీనుంచి మహాసేన రాజేష్‌ను ప్రకటించారు. కానీ కొన్ని కారణాల వల్ల ఆయన స్వచ్ఛందంగా టిక్కెట్ వదులుకున్నారు. పోలీస్ విభాగంలో పనిచేసిన గిడ్డి సత్యనారాయణ జనసేన తరఫున అనూహ్యంగా ఆ టిక్కెట్ అందుకుని విజయం సాధించారు.
- ఎన్నికల ముందు వరకూ జనసేనలో ఉన్న పితాని బాలకృష్ణ, శెట్టిబత్తుల రాజబాబు, డీఎంఆర్ శేఖర్, టీడీపీలో ఉన్న గొల్లపల్లి సూర్యారావు ఎన్నికల ముందు వైసీపీలో చేరారు.
- మునిసిపల్ కౌన్సిలర్ కుమారుడైన సుభాష్ అనూహ్యంగా రామచంద్రపురం టిక్కెట్ దక్కించుకున్నారు. ఎమ్మెల్యేగా విజయం సాధించి మంత్రి అయ్యారు.
- వైసీపీ ప్రభుత్వంలో రామచంద్రపురం, కొవ్వూరు నుంచి మంత్రులుగా కొనసాగిన చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, తానేటి వనిత వారు పనిచేసిన నియోజకవర్గాల్లో కాకుండా రాజమహేంద్రవరం, గోపాలపురం నియోజకవర్గాల్లో పోటీచేసి ఓటమి పాలయ్యారు.

- మార్పు తెచ్చిన 'తూర్పు'తీర్పు
- 2024లో రాజకీయ సంచలనం
- కూటమికి మద్దతుగా ఓటర్లు
- అన్ని స్థానాల్లో క్లీన్‌స్వీప్
- 21 స్థానాల్లోను అఖండ విజయం
- వైసీపీకి వాతపెట్టిన జనం
- పిఠాపురం నుంచి బరిలో పవన్
- రాజమండ్రి నుంచి పురందేశ్వరి
- రాష్ట్రవ్యాప్తంగా మార్మోగిన జిల్లా
- చంద్రబాబు.. మోదీ ప్రచారం
- ఓటు సంవత్సరంగా 2024



అరాచకాన్ని అదిమిపట్టి.. ఓటుతో తొక్కేశారు!

మే 14న అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా అప్పటికే కూటమికి అధికారం కట్టబెట్టడానికి సిద్ధపడ్డ ఓటర్లు కనివినీ ఎరుగని రీతిలో పోలింగ్ బూత్‌లకు పోటెత్తారు.పోలింగ్ సమయం ముగిసినా సరే కదలకుండా అర్ధరాత్రి పన్నెండు దాటినా ఓట్లు వేసి తీరాలనే కసితో బారులు తీరారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఓటర్ల పట్టుదల రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చేశాయి. జూన్ 4న వెల్లడైన ఫలితాల్లో ఓటర్ల సునామీ తీర్పును కళ్లకు కట్టాయి. ఈ ఫలితాల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 19 అసెంబ్లీ స్థానాలతో పాటు రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం పరిధిలోని రెండు సీట్లు కలిపి మొత్తం 21 స్థానాల్లో కూటమి పార్టీ విజయం సాధించింది. అసలు ఒక్కటంటే ఒక్క సీటు కూడా అధికార వైసీపీ గెలవలేదు.ఐదేళ్ల పాటు అధికారాన్ని అడ్డంపెట్టుకుని విర్రవీగి ఉమ్మడి జిల్లాను అన్ని విధాలా లూటీచేసిన వైసీపీ నేతలను ప్రజలు ఈడ్చికొట్టారు. చెంప చెళ్లమనే తీర్పునిచ్చి పాతాళానికి తొక్కేశారు.కూటమిలో ఒక్కో ఎమ్మెల్యేకు రికార్డుస్థాయి మెజార్టీ కట్టబెట్టారు.

పదవులు వరించెన్

ఈ ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొందరిని అనూహ్యంగా ఉన్నత పదవులు వరించాయి.కొత్తవారికి మంత్రి పదవులు దక్కగా ఆయా పార్టీలకు విధేయులుగా ఉంటూ కూటమి గెలుపునకు కృషి చేసిన వారికి నామినేటెడ్ పోస్టులు లభించాయి. ఉమ్మడి జిల్లా నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిఠాపురం నుంచి భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచి డిప్యూటీ సీఎం అయ్యారు. పలు కీలక శాఖలకు మంత్రిగా వ్యవహరిస్తున్నారు. నిడదవోలు నుంచి జనసేన తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన కందుల దుర్గేశ్ పర్యాటక శాఖ మంత్రి అయ్యారు. రామచంద్రపురం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన వాసంశెట్టి సుభాష్ సామాజిక సమీకరణల్లో భాగంగా అనూహ్యంగా మంత్రి పదవి దక్కించుకున్నారు. టీటీడీ బోర్డు మెంబర్లుగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, సీతానగరం మండలం రఘుదేవపురానికి చెందిన పారిశ్రామికవేత్త అక్కిన మునికోటేశ్వరరావు ఎంపికయ్యారు. కౌడా ఛైర్మన్‌గా పెద్దాపురం జనసేన ఇన్‌చార్జి తుమ్మలబాబు, రుడా ఛైర్మన్‌గా బీవీఆర్ చౌదరి, ఆడా ఛైర్మన్‌గా ఎ.స్వామి నాయుడు, సివిల్ సప్లైస్ ఛైర్మన్‌గా జనసేన కాకినాడ నగర అధ్యక్షుడు తోట సుధీర్, శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కుడుపూడి సత్తిబాబు ఇంకా చాలామంది నాయకులు ఆయా కార్పొరేషన్లకు డైరెక్టర్లుగా ఎంపిక య్యారు. తుని ఎమ్మెల్యే యనమల దివ్య, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబులను ప్రభుత్వ విప్‌లుగా నియమించారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును శాసనసభ అంచనాల కమిటీ ఛైర్మన్‌గా, సీఎం ప్రోగ్రాం కమిటీ ఛైర్మన్‌గాఉన్న టీడీపీ సీనియర్ నేత పెందుర్తి వెంకటేశ్‌కు కేబినెట్ హోదా కల్పించారు. ఇలా జిల్లాకు చెందిన పలువుర్ని పదవులు వరించాయి.





పండక్కి.. ఫుల్‌గా

- కొత్త ఏడాది ఆర్టీసీకి 'పెద్ద పండుగ'
- డౌన్‌లో 88 స్పెషల్ బస్సులు
- సాధారణ చార్జీలే అమలు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు ఫుల్ అయింది. పెద్ద పండగ సంక్రాంతి సందర్భంగా రిజర్వేషన్ టిక్కెట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. హైదరాబాద్ నుంచి తూర్పుగోదావరి జిల్లాకు మొత్తం 88 స్పెషల్ బస్సులు వేసినా వాటిలోనూ టిక్కెట్లు అయిపోయాయి.దీంతో మరిన్ని స్పెషల్ బస్సులు ఏర్పాటు చేయాలనే డిమాండ్ పెరుగుతోంది. షెడ్యూలు సర్వీసులు, స్పెషల్ బస్సులన్నీ నిండిపోవడంతో జనవరి 9, 10, 11, 12, 13 తేదీల్లో హైదరాబాద్ నుంచి జిల్లాకు వచ్చే సర్వీసులకు రిజర్వేషన్ కౌంటర్ క్లోజ్ చేసేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పెద్ద పండక్కి మూడు వారాల ముందే టిక్కెట్లన్నీ బుక్ కావడం ఆర్టీసీ అధికారులు,ఉద్యోగుల్లో ఆశ్చర్యం కల్గిస్తోంది.షెడ్యూలు బస్సులతో పాటు స్పెషల్ బస్సుల్లోనూ టిక్కెట్లు రేట్లు పెంచలేదు.సాధారణ చార్జీలనే వసూలు చేస్తున్నారు.

జిల్లా నుంచి 88 స్పెషల్స్ ..

పెద్ద పండక్కి జిల్లా నుంచి హైదరాబాద్ వెళ్లే వారికంటే అక్కడి నుంచి వచ్చే వారే ఎక్కువ. ఈ మేరకు ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాటు చేసింది. జనవరి 9, 10, 11, 12, 13 తేదీల్లో హైదరాబాద్ నుంచి జిల్లాకు ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడుపుతోంది. ఈ బస్సులన్నీ ముందు రోజు ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లి ఆయా రోజుల్లో ప్రయాణీకులతో తిరిగి చేరుకుంటాయి. జిల్లాలోని రాజమహేంద్రవరం, నిడదవోలు, కొవ్వూరు, గోకవరం డిపోల నుంచి సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ స్పెషల్ బస్సులు నడుపుతున్నారు. ఇవన్నీ పెద్దపండక్కి హైదరాబాద్ నుంచి జిల్లాకు వచ్చే ప్రయాణీకుల కోసం (డౌన్‌లో) ఏర్పాటు చేశారు. 9వ తేదీన గోకవరం డిపో నుంచి ఒక ఎక్స్‌ప్రెస్ సర్వీసు, 10న ఐదు, 11న నాలుగు, 12న ఐదు, 13న ఒకటి ఎక్స్‌ప్రెస్ సర్వీసులను నడుపుతున్నారు. కొవ్వూరు డిపో నుంచి 9వ తేదీన మూడు సూపర్ లగ్జరీ, 10న మూడు సూపర్ లగ్జరీ, ఒక ఎక్స్‌ప్రెస్, 11న మూడు సూపర్ లగ్జరీ, ఒక ఎక్స్‌ప్రెస్, 12న మూడు సూపర్ లగ్జరీ, ఒక ఎక్స్‌ప్రెస్, 13న ఒక సూపర్ లగ్జరీ సర్వీసు నడుపుతున్నారు. నిడదవోలు డిపో నుంచి 9వ తేదీన రెండు సూపర్ లగ్జరీ, 10న రెండు సూపర్ లగ్జరీ, 11న రెండు సూపర్ లగ్జరీ, 12న రెండు సూపర్ లగ్జరీ, 13న ఒక ఎక్స్‌ప్రెస్ సర్వీసు నడుపుతున్నారు. ఇక రాజమహేంద్రవరం డిపో నుంచి 9వ తేదీన నాలుగు సూపర్ లగ్జరీ, రెండు అల్ట్రా డీలక్స్, 10న ఏడు సూపర్ లగ్జరీ, నాలుగు అల్ట్రా డీలక్స్, మూడు ఎక్స్‌ప్రెస్, 11న ఆరు సూపర్ లగ్జరీ, నాలుగు అల్ట్రా డీలక్స్, రెండు ఎక్స్‌ప్రెస్, 12న ఏడు సూపర్ లగ్జరీ, నాలుగు అల్ట్రా డీలక్స్ మూడు ఎక్స్‌ప్రెస్, 13న ఒక సూపర్ లగ్జరీ సర్వీసు నడుపుతున్నారు. ఇలా గోకవరం డిపో నుంచి 16 సర్వీసులు, కొవ్వూరు డిపో నుంచి 16 సర్వీసులు, నిడదవోలు డిపో నుంచి 9 సర్వీసులు, రాజమహేంద్రవరం డిపో నుంచి 47 సర్వీసులు స్పెషల్స్ నిర్వహిస్తున్నారు. రాజమహేంద్రవరం నుంచి విజయవాడ, విశాఖపట్నంతో పాటు కాకినాడ వంటి ప్రాంతాలకు స్పెషల్ సర్వీసులు నడపాలని భావిస్తున్నా ముందస్తు రిజర్వేషన్ సదుపాయం లేదు.

విద్యుత్ చార్జీల పెంపుపై వైసీపీ నిరసన



వినతిపత్రం అందజేస్తున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు వేణు, మాజీ ఎంపీ భరత్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల అదనపు భారాలను ప్రజల మోపుతున్న కూటమి ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తున్నామని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ అన్నారు. విద్యుత్ అదనపు చార్జీలను వ్యతిరేకిస్తూ శుక్రవారం కోటిపల్లి బస్టాండ్ నుంచి నిరసన బైక్ ర్యాలీ చేశారు. గోదావరి బండ్ రోడ్డులోని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేశారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందించారు. నిరసనలో మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్, రుడా మాజీ ఛైర్మన్ మేడపాటి షర్మిళారెడ్డి, వైసీపీ నాయకులు గిరిజాలబాబు, గుర్రం గౌత మ్, నక్కా శ్రీనగేష్, సంకిస భవాని ప్రియ, పోలు విజయలక్ష్మి, మార్తి లక్ష్మి పాల్గొన్నారు.

నిడదవోలు మాజీ ఎమ్మెల్యే జీఎస్ నాయుడు గైర్హాజరు

నిడదవోలు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీల అదనపు భారాన్ని తగ్గించాలని కోరుతూ శుక్రవారం నిడదవోలులో వైసీపీ ర్యాలీ, ధర్నా నిర్వహించింది.ఈ ఆందోళనకు నిడదవోలు మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు గైర్హాజరయ్యారు.పార్టీ పిలుపు ఇచ్చినా ఆయన కార్యక్రమాల్లో పాల్గొనక పోవడంపై పార్టీ శ్రేణుల్లో ఏవో గుసుగుసలు వినిపిస్తున్నాయి. పార్టీలోని ఒక వర్గం మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు తండ్రి మాజీ ఎమ్మెల్యే జీ.ఎస్.రావు అనారోగ్యంతో ఉన్న కారణంగా రాలేకపోయారని చెబుతున్నారు.అదే పార్టీలోని మరొకవర్గం ఆయన పార్టీ మారే ఆలోచనతోనే కాస్త దూరంగా ఉం టున్నారని చెప్పుకుంటున్నారు.ఈ కారణంతోనే నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల్లో రాజమండ్రి పార్లమెంటు ఇన్‌చార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పాల్గొంటున్నారనే చర్చ సాగుతోంది. శుక్ర వారం జరిగిన విద్యుత్ ధర్నా కూడా ఆయన ఆధ్వర్యంలోనే జరగడం అనుమానాలకు తావిస్తోంది.

బ్యాంకర్లు రుణాల లక్ష్యం చేరాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 27 (ఆంధ్ర జ్యోతి): బ్యాంకర్లు రుణాలు మంజూరులో ఉదారంగా వ్యవహరించాలని కలెక్టర్ ప్రశాంతి సూచించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన బ్యాంకర్లతో సమీక్షించారు.2024-25 త్రైమాసిక ప్రణాళిక అమలు పురోగతి, వ్యవసాయ అనుబంధ రుణ ప్రణాళిక ప్రగతి విద్యా రుణాలు, టిడ్కో ఇంటి రుణాలు, వికసిత్ భారత్ , విశ్వకర్మ యోజన, కేంద్ర ప్రభుత్వ పథకాలకు బ్యాంకు రుణాలు తదితర అంశాలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో రైతులకు రుణ ప్రణాళికలో భాగంగా స్వల్ప కాలిక, టర్మ్ లోన్లు మొత్తం 11,106 లక్ష్యంకాగా 7201 మందికి రుణాలు మంజూరు చేశామన్నారు. కౌలు రైతులు 30,179 మందికి సుమారు రూ.150.5 కోట్లు రుణాలు అందజేశాన్నారు.20,515 డ్వాక్రా సంఘాలకు రూ. 1,421.56 కోట్ల లక్ష్యానికి 9478 గ్రూపులకు రూ. 592 కోట్లు (41.71)శాతం మంజూరు చేసినట్టు చెప్పారు. నూతన పాలసీ ప్రకారం ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. లక్ష్యాలు సాధించని బ్యాంకర్లపై సీఈవోకి ఫిర్యాదు చేయడం జరుగుతుందన్నారు. నెల రోజుల అనంతరం బ్యాంకుల ప్రగతి నివేదిక ఆధారంగా తదుపరి కార్యాచరణ ఉంటుందన్నారు డీసీసీబీ, యుకో, కొటక్ తదితర బ్యాంకుల లక్ష్య సాధనలో వెనుకబాటుపై వివరణ కోరారు. రానున్న డిసిసి సమావేశానికి ముఖ్యఅధికారులు హాజరు కావాలన్నారు. సమావేశానికి హాజరైన వారికి సరైన అవగాహన లేకపోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీసీ కన్వీనర్, డీజీఎం ఎ.విశ్వేశ్వరరావు, నాబార్డు ఏజీఎం వైఎస్ నాయుడు, ఆర్బీఐ ప్రతినిధి సీహెచ్.నవీన్ కుమార్, ఇతర జిల్లా అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.



బ్యాంకర్లతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

నాడే చార్జీలు పెంచేసి.. నేడు ధర్నాలా!

అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జగన్ సీఎంగా ఉండగా పెంచిన విద్యుత్ చార్జీలపై ఇప్పుడు ధర్నాలు చేయాలని పిలుపునిచ్చిన మాజీ ముఖ్యమంత్రిది తుగ్లక్ చర్య కాక మరేమిటని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. వైసీపీ నాయకులు విద్యుత్ చార్జీలపై నిరసన కార్యక్రమాలు చేపట్టంపై శుక్రవారం ఆయన తన కార్యాలయంలో స్పందించారు.గత పాలకులు ఇచ్చిన ఆదేశాలు ఇప్పుడు అమలవుతున్నాయి తప్ప కూటమి ప్రభుత్వం ఏమి పెంచలేదన్నారు. విద్యుత్ చార్జీల పాపం నాటి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.ఈఆర్‌సి ఆదేశాలు 2021-24కు ఏవిధంగా ఉన్నాయన్న విష యం ప్రజలకు తెలియాలన్నారు. 2021-22కి ఏపి ఈఆర్‌సీ ట్రూఆఫ్ చార్జీలు అప్రూవ్ చేసింది 3082 కోట్లు, 2022-23కి 6073కోట్లు 2023-24కి 11000 కోట్లు మొత్తం దాదాపు 22 వేల కోట్ల భారం ప్రజలపై మోపార న్నారు.ఈ చార్జీలు 2024 డిసెంబరు నుంచి అమలు చేయాలని ఆనాడు జగన్ ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ పాపం ఎవరిదో నేడు ధర్నాలు చేస్తున్న నాయకులు చెప్పాలని అన్నారు. 2014లో లోటు విద్యుత్ బడ్జెట్‌తో రాష్ట్రం ఏర్పడితే 2019 నాటికి సీఎం చంద్రబాబు మిగులు బడ్జెట్ రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు. అధికారం చేపట్టిన జగన్‌రెడ్డి జెన్‌కో ట్రాన్స్‌కోలను సర్వనాశనం చేశాడన్నారు.సమావేశంలో ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ సుధాకరరెడ్డి, నాయకులు సత్తి దేవదానరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి,తాడి గంగిరెడ్డి,ప్రసాదరెడ్డి,సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

రిటైర్డ్ మిలట్రీ ఉద్యోగి గన్ మిస్ ఫైర్ | ప్రజల పక్షాన సీపీఐ శత దినోత్సవ సభలో రామకృష్ణ | నేటి నుంచి క్రియ చిన్నారుల పండుగ 7

ప్రతి వీధీ.. ఓ చరిత్రే!

- ఆంధ్రజ్యోతి/రాజమహేంద్రవరం



రాజమహేంద్రిలో ప్రతిచోటు వెనుకా ఎంతో ఆసక్తి
బ్రిటీషర్లకూ తగు గౌరవం
లిస్టర్, ఇన్నీస్ పేరుతో ప్రాంతాలు

రాజమహేంద్రవరం వెయ్యేళ్ల చరిత్ర కలిగిన నగరం అనడంలో సందేహం లేదు. గోదావరి తీరం శిలామృత్తిక (ఫాసిల్)గా ఏర్పడిందని చరిత్రకారుల అభిప్రాయం. ఇలా మట్టి శిలారూపంలోకి రావాలంటే లక్షల ఏళ్ల కాలం పడుతుంది. అంటే ఈ ప్రాంతానికి అంత వయసు ఉందని అర్థం చేసుకోవచ్చు. అలాంటి ఈ ప్రాంతం ఎన్నో చారిత్రక ఆనవాళ్లకు అలవాలం కావడం అతిశయోక్తి కాదు. ఇక్కడ చిన్న పల్లెటూరిగా అంకురించి నేడు వృక్షంగా విస్తరించి ఐదు లక్షల పైబడి జన సంచారంతో రోజురోజుకూ అభివృద్ధిలో దూసుకుపోతూ నగరపాలక సంస్థ స్థాయికి చేరుకొంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖ నగరంగా పేరు గడించింది. గోదారమ్మ ఒడ్డున ఆధ్యాత్మిక ధామంగా విలసిల్లుతోంది. ఇక్కడ ప్రతి ప్రాంతం వెనుకా ఓ చరిత్ర దాగి ఉంటుంది. ఈ క్రమంలో కొన్ని బ్రిటీషర్లకూ సముచిత గౌరవాన్ని ఇవ్వడం మన చూడవచ్చు. రాజమహేంద్రిలోని ఐతిహ్యాల్లో కొన్నిటిని 'ఆంధ్రజ్యోతి' మీ ముందుకు తీసుకొస్తోంది.



ఆర్యాపురంలో ఉన్న లిస్టర్ పేట మున్సిపల్ స్కూల్

● లిస్టర్ పేట

ప్రస్తుత ఆర్యాపురమే లిస్టర్‌పేట. 1895లో రాజమహేంద్రవరంలో బ్రిటిషర్ అయిన లిస్టర్ సబ్‌కలెక్టరుగా పనిచేశారు. 130 ఎకరాల ప్రభుత్వ భూములను 3 వీధులతో ప్లాట్లుగా విభజించి పేదలకు నామమాత్రపు ధరకు ఇచ్చారు. వారిలో 90 శాతం పురోహితులు ఉన్నారు. అందువల్ల ఆయన పేరుతో లిస్టర్ పేటగా స్థిరపడింది. ఈ పేట 1897లో మునిసిపాలిటీలో విలీనమైంది. అయితే ఇక్కడ అధికశాతం పురోహితులు ఉండడం వల్ల 'ఆర్యపురం' అని నామకరణం చేసుకున్నారు. అయితే అధికారిక రికార్డుల్లో లిస్టర్ పేటగానే ఉండేది. 1935లో ఇక్కడ సత్యనారాయణస్వామి గుడి కట్టారు. సంఘ సేవకులు, మాజీ మంత్రి ఏబీ నాగేశ్వరరావు ఈ ప్రాంతంలోనే నివాసం ఉండేవారు. చరిత్రకు మౌన సాక్ష్యంగా నిలిచిన లిస్టర్ పేట మునిసిపల్ స్కూలును ఈనాటికీ ఇక్కడ చూడొచ్చు.

● ఇన్నీస్ పేరున...

లిస్టర్‌పేట కంటే ముందే ఇన్నీస్ పేట ఏర్పడింది. 1865 ప్రాంతంలో సబ్ కలెక్టర్‌గా పని చేసిన ఇన్నీస్ చొరవతో ఇక్కడ నివాస ప్రాంతం వచ్చింది. కుమారి టాకీస్, జూనియర్ కళాశాల, తూర్పువైపున రాజవీధి (మెయిన్ రోడ్) వరకూ ఈ పేట విస్తరించి ఉండేది. ఇక్కడ మొదటిగా ఆంధ్రభీష్మగా పేరుగాంచిన న్యాపతి సుబ్బారావు పంతులు ఇల్లు కట్టుకొన్నారు. 1870లో నాళం వారి సత్రం నిర్మించారు. ఇక్కడ అన్న వితరణ జరిగేది. రాజమండ్రి రైల్వే స్టేషను వైపు నుంచి వస్తుంటే రాజవీధి మొదట్లో ఈ సత్రం ఉండడంతో జనాదరణ ఎక్కువగా ఉండేది. ఇన్నీస్ పేటలోని మొదటి వీధిని వైత్రాం రోడ్డు అని పిలిచేవారు. ఈయన కూడా సబ్ కలెక్టరే కావడం గమనార్హం. తర్వాత మయూరీ టాకీస్ రోడ్డుగా మారింది. 1910 తర్వాత ఇన్నీస్ పేట కాస్త కుచించుకొని రాజవీధి నుంచి ట్రైనింగ్ కళాశాల వరకూ పరిమితమైంది. అప్పట్లో ఇన్నీస్ పేటను ఆనుకొని హుకుంపేట పరిధి ఉండేది. ఉన్నత పాఠశాల నిర్మాణం కోసం 1907లో ఇన్నీస్‌పేటను ఆనుకొని ఉన్న హుకుంపేటలో వీరేశలింగం పంతులు 6 ఎకరాల భూమిని ఎకరం రూ.1,200 చొప్పున కొనుగోలు చేశారు. శామలా థియేటర్ నిర్మాణం తర్వాత ఈ పేటలోని కొంత భాగం శ్యామలా సెంటర్‌గా పేరు మార్చుకొంది. ఈ ప్రాంతం



కోటిపల్లి బస్టాండ్ సెంటర్, ఇన్నీస్ పేట రోడ్డు

ఆనాడు లారీల స్టాండులు కావడం వల్ల లారీలతో నిండి ఉండేది. ఇప్పటి టి.నగర్ కూడా ఇన్నీపేట పేటలో భాగమే. 35ఏళ్లపాటు ఈ ప్రాంతంలో త్యాగరాజ ఉత్సవాలు నిరంతరాయంగా జరిగాయి. దీంతో ఈ ప్రాంతానికి పేరు మార్పు చేయాలని గానకళారాధక బుగ్గా పాపయ్య శాస్త్రి పట్టుబట్టారట. దీంతో అప్పటి మునిసిపల్ ప్రత్యేక అధికారి ఎ.సుబ్బారావు చొరవ చూపి గోదావరి గట్టు కింద, రాజవీధి, ఇన్నీస్‌పేటలోని కొంత భాగాన్ని కలిపి త్యాగరాజనగర్ (టి.నగర్)గా పేరు పెట్టారు. త్యాగరాజస్వామి పేరుతో ఏర్పడిన మొట్టమొదటి పేట ఇదేనని చెబుతారు. చెన్నైలోని త్యాగరాయనగర్ ఉన్నా.. అది త్యాగరాయశెట్టి అనే వ్యాపారస్తుడి పేరుతో ఏర్పడింది.

● జామి, రామదాసు, సీతంపేటలు

విశాఖపట్నం జిల్లాలోని జామి ప్రాంతంలో కరువుకాటకాల వల్ల కొందరు చేనేత కార్మికులు ఇక్కడికి వలస వచ్చారు. వారికి మునిసిపాలిటీ ఒక జామతోట ప్రాంతాన్ని కొని ఇళ్ల స్థలాలను ఇచ్చింది. దీనిని జామిపేటగా పిలిచేవారు. కాలక్రమంలో జాంపేటగా పిలుస్తున్నాం. ఇక్కడి గాంధీ విగ్రహాన్ని ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆవిష్కరించారు. ఎడ్ల రామదాసు అనే ఆధ్యాత్మికవేత్త తన కీర్తనల ద్వారా అహింస, నీతి, వేదాంతం, దైవభక్తి వంటి వాటిపై జాగృతం చేసేవారు. ఆయన 1917లో కాలం చేశారు. ఇక్కడ ఆయన సమాధిని ఏర్పాటు చేసి రామదాసు పేటగా పిలుచుకోవడం జరిగింది. ఈ పక్కనే విశ్రాంతిపురం(టీబీ శానిటోరియం)లో క్షయవ్యాధి నివారణ కేంద్రం ఉండేది. ఇక్కడికి వచ్చే రోగుల సంబంధీకులు రామదాసుపేటలో బస చేసేవారు. ఈయన పేరుతో కాకినాడలో కూడా ఒక వీధి ఉంది. కాండ్రేగుల జమిందారు తన తల్లి సీతమ్మ పేరుతో బ్రాహ్మణులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఒక చెరువును కూడా తవ్వించారు. దానిని సీతమ్మ చెరువుగా పిలిచేవారు. ఈ ప్రాంతమే ఇప్పుడు మనం పిలుస్తున్న సీతంపేట.



● ఇదే పాల్ చౌక్

ప్రస్తుతం కోటిపల్లి బస్టాండ్ ఉన్న ప్రాంతమే ఇది. భారత స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో వందేమాతరం ఉద్యమం ఉవ్వెత్తున్న ఎగిసిపడుతున్న రోజులవి. 1907లో ప్రముఖ ఉద్యమకారుడు బిపిన్ చంద్రపాల్ నగరానికి వచ్చారు. ఐదు రోజులపాటు ఉత్తేజితం చేసే ప్రసంగాలు చేశారు. ఆ సమయంలో ప్రసిద్ధ కవి చిలకమర్తి లక్ష్మీ నరసింహరావు.. 'భరత ఖండంబు చక్కని పాడియావు, హిందువులు లేగదూడలై ఏడ్చుచుండ, తెల్లవారను గడుసరి గొల్లవారు, పితుకుచున్నారు మూతులు బిగియకట్టి' అనే పద్యాన్ని అప్పటికప్పుడు ఆశువుగా రచించి వినిపించారు. ఇది బ్రిటిష్ ప్రభుత్వాన్ని వణికించడంతో కోర్టులో కూడా విచారణ జరిగింది. ఇలా ఆ పద్యం దశదిశలా వ్యాపించింది. దీంతో ఈ ప్రాంతానికి పాల్ చౌక్ అనే పేరు వచ్చింది. బస్టాండ్, లారీ స్టాండ్ (జెట్టీ టవర్స్ ప్రదేశం), అక్కడి 3 పార్కుల విశాల ప్రాంతాన్ని పాల్‌చౌక్‌గా వ్యవహరించేవాళ్లు. ఆనాడు గాంధీజీ, జవహర్‌లాల్ నెహ్రూ, ప్రకాశం పంతులు, సరోజిని నాయుడు వంటి మహానుభావులు ఎందరో ఇక్కడ ప్రసంగించారు. ఇలాంటి చారిత్రక ప్రదేశాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని, ఈ ప్రాంతంలో ప్రైవేటు భవనాలకు అనుమతులు కూడదని ఆనాటి ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి పీవీ నరసింహారావు ఉత్తర్వులు కూడా ఇచ్చారు.



● సుబ్రహ్మణ్య మైదానం

ఆనం కళా కేంద్రం పక్కన ఉన్న సుబ్రహ్మణ్య మైదానం అందరికీ సుపరిచితమే. పూర్వం ఇది పోలీస్ పెరేడ్ గ్రౌండ్. స్వాతంత్ర్యం సిద్ధించిన రోజున కల్నల్ డీఎస్ రాజు.. ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు, సీతానగరంలోని గౌతమీ సత్యాగ్రహాశ్రమం వ్యవస్థాపకులు డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం పేరున ఈ మైదానాన్ని సుబ్రహ్మణ్య మైదానంగా ప్రకటించారు. రాజమండ్రికి రెండుసార్లు పార్లమెంటు సభ్యుడిగా, నేతాజీ అంతరంగిక వైద్యులుగా డీఎస్ రాజు పనిచేశారు. ఒకప్పుడు ఇక్కడ పోలీస్ స్టేషను నిర్మాణానికి జనం ఒప్పుకోలేదు. మధ్యలో గోడ కడతామని చెప్పినా వ్యతిరేకత ఎదురైంది. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో ఈ ఆనవాలును కూడా చరిత్రలో కలిపేశారు.

సముద్ర తీర భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి: కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సముద్ర తీరంలో ప్రమాదాలు చోటు చేసుకోకుండా తీర భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి తగిన చర్యలు చేపట్టాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కాకినాడ జిల్లా స్థాయి కోస్టల్ సెక్యూరిటీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ తీర ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున అధికారులు అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు. వారం చివరి రోజు, పండుగల సందర్భాల్లో ఎక్కువ సంఖ్యలో ప్రజలు సముద్ర తీరానికి వస్తున్నారన్నారు. మత్స్యకారులు వేట సందర్భాల్లో ఎటువంటి మరణాలు సంభవించకుండా తీర భద్రత సిబ్బంది, ఇతర శాఖల సిబ్బందిని సమన్వయం చేసుకుని షెడ్యూల్ ప్రకారం పెట్రోలింగ్ చేయాలన్నారు. సముద్ర స్నానాల సమయంలో ప్రజలు సముద్రం లోపలికి ఎక్కువగా వెళ్లకుండా భద్రతా సిబ్బంది పర్యవేక్షణ చేయాలన్నారు. మత్స్యకారులు వేట సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాతావరణ మార్పులపై మత్స్యకార ప్రాంతాల్లో అధికారుల బృందాలు నిరంతరంగా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. కాకినాడ ఎన్టీఆర్ బీచ్, సూర్యారావుపేట బీచ్, ఉప్పాడ బీచ్‌ల వద్ద మరింత సమర్థవంతంగా భద్రతా చర్యలు చేపట్టేందుకు వాచ్ టవర్స్ పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం, బోట్ల ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఏపీ మెరైన్ సెక్యూరిటీ పోలీస్ అడిషనల్ ఎస్పీ మధుసూదనరావు, ఇండియన్ కోస్ట్‌గార్డ్ సహాయక ఇంజనీర్ ధనుంజయ్, జిల్లా మత్స్య శాఖ అధికారి కరుణాకర్, నేవీ లెఫ్టినెంట్ కమాండర్ ఆవేశ్, వాకలపూడి మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిత్తడి నేలలు, తాబేళ్లను పరిరక్షించాలి

కాకినాడ జిల్లా స్థాయి అటవీ కమిటీ సమావేశంలో కలెక్టర్ షాన్‌మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చిత్తడి నేలలు, సముద్ర తాబేళ్ల పరిరక్షణకు అటవీ, మత్స్య, మెరైన్ పోలీస్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కాకినాడ జిల్లా స్థాయి అటవీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తడి నేలల పరిరక్షణ, నిర్వహణ నియమం-2017 ప్రకారం కాకినాడలో చిత్తడి నేలలను నోటిఫై చేయాలన్నారు. సముద్ర తీర ప్రాంతాలకు ఆనుకుని ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉంచుకుని ఈ చిత్తడి నేలలో అరుదైన మొక్కలు, పక్షులు, జంతువులు, చేపలు గుడ్లు పెట్టడానికి చాలా అనుకూలంగా ఉంటాయన్నారు. కోరింగ వన్యప్రాణుల అభయారణ్యంలో ఎకో, సెన్సిటివ్ జోన్ మాస్టర్ ప్లాన్ తయారీకి తిరువనంతపురంలోని పర్యావరణ అభివృద్ధి కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. జలాచర జీవుల్లో ఆలివ్ రిడ్లీ తాబేళ్లు ఎంతో వైవిధ్యంతో కూడుకున్నవన్నారు. వీటి మరణాలను నిరోధించేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. సముద్ర తాబేళ్లు గుడ్లు పెట్టడానికి ప్రతిఏటా డిసెంబరు నుంచి మే నెల వరకు సముద్ర తీరానికి వస్తూ ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో చేపలు పట్టే వలలు, ట్రాలర్లలో ప్రమాదవశాత్తు చిక్కుకుని మరణాలు సంభవిస్తున్నాయన్నారు. డిసెంబరు నుంచి మే నెల వరకు సముద్ర తాబేళ్లు గూడు కట్టే ప్రదేశాల చుట్టూ ఐదు కిలోమీటర్ల వ్యాసార్థంలో మెకనైజ్డ్ ట్రావెర్ల ద్వారా చేపలు వేటాడకుండా అటవీ, మెరైన్, కోస్ట్‌గార్డు, మత్స్యశాఖల విభాగాలు సముద్రంలో నిరంతరం ఉమ్మడి పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. సమావేశంలో కాకినాడ జిల్లా అటవీ అధికారి రవీంద్రనాథ్ రెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధికారి కరుణాకర్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు గణపతి, కాకినాడ, కోరంగి ఫారెస్ట్ రేంజర్లు శ్రీదీప్తి, వరప్రసాద్ పాల్గొన్నారు.

'కడియం నర్సరీలు ప్రయోగశాలలు'



కర్ణాటక రాష్ట్ర ఉద్యానవన శాఖాధికారులకు పుష్పగుచ్ఛాలు ఇస్తున్న స్థానిక నర్సరీల యజమానులు

కడియం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియం మండలంలోని నర్సరీలు ప్రయోగశాలలు అని కర్ణాటక రాష్ట్ర ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ విశ్వనాథశర్మ పేర్కొన్నారు. ఆ రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 25 మంది ఉద్యానవన శాఖ అధికారులు శుక్రవారం శ్రీదుర్గా నర్సరీ అధినేత పెద్దిరెడ్డి శ్రీనుతో కలిసి సత్యదేవ, పల్ల వెంకన్న, సత్యనారాయణ, వెంకట శ్రీనివాస, గౌతమి నర్సరీల్లో వివిధ రకాల మొక్కలను పరిశీలించారు. పలు రకాల మొక్కల శాస్త్రీయ నామాలు, వాటి విశిష్టతలను అడిగి తెలుసుకున్నారు. వివిధ పండ్ల జాతి మొక్కలు, పుష్పాల మొక్కలను తిలకించారు. కడియపులంక అంతర్ రాష్ట్ర పూల మార్కెట్‌ను పరిశీలించి మార్కెట్ విధివిధానాలపై యాజమాన్యాన్ని అడిగారు. మార్గాని సత్యనారాయణ, గంగుమళ్ల సత్యనారాయణ, పల్ల సత్తిబాబు, పుల్లా పెదసత్యనారాయణ, మల్లు పోలరాజు, చిలుకూరి త్రిమూర్తులు, మార్గాని వీరబాబు, ధర్మాసనం వెంకట రమణ, పాటంశెట్టి బాబ్జీ, పాటంశెట్టి బూరయ్య మొక్కల విశిష్టతలను వివరించారు.



మన్మోహన్‌సింగ్‌కు నివాళి

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ కన్నుమూయడంతో ఆయన పాలనలో చేసిన కృషిని ప్రతి ఒక్కరూ గుర్తుచేసుకుంటున్నారు. దేశానికి ఎంతో సేవ చేసిన ఆ మహనీయుడిని స్మరించుకుంటూ నివాళులు అర్పిస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని బండారులంకకు చెందిన ప్రముఖ కార్టూనిస్టు మాడా రాము మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పిస్తూ క్యారికేచర్ గీశారు. పలువురు కళాకారులు, చిత్రకారులు మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించారు.

- ఆంధ్రజ్యోతి/అమలాపురం రూరల్



ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో ఎంఎం పళ్లంరాజు

మన్మోహన్ సింగ్ బ్రిలియంట్ ప్రధాని

ప్రత్తిపాడు/సామర్లకోట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మన్మోహన్‌సింగ్ బ్రిలియంట్ ప్రధాని అని మాజీ కేంద్రమంత్రి ఎంఎం పళ్లంరాజు అన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ కన్నుమూయడంతో శుక్రవారం ఆయన ఘన నివాళి ప్రకటించారు. ఈ సందర్భంగా పళ్లంరాజు మాట్లాడుతూ దేశాభివృద్ధికి మన్మోహన్ సింగ్ ఎంతో కృషి చేశారని, ఆర్థిక శాఖ మంత్రిగా ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. మానవ వనరుల అభివృద్ధి కోసం యూపీఏ ప్రభుత్వంలో మన్మోహన్‌సింగ్ మంత్రివర్గ సహోద్యోగిగా తనను చేర్చడం ద్వారా ప్రధానిగా ఎంతో విశ్వాసాన్ని ఉంచారని గుర్తుచేసుకున్నారు.





మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్‌తో మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్‌కుమార్, జీవీ హర్షకుమార్

ద్రాక్షారామ ప్రజలకు మేలు చేసిన మన్మోహన్ : మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కోనసీమ జిల్లాలోని ద్రాక్షారామ గ్రామ ప్రజలకు ఎనలేని మేలు చేశారని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తెలిపారు. ద్రాక్షారామ చారిత్రక ప్రాంతం కావడం వల్ల అక్కడ ఒక ఇటుక తీయడానికి, వేయడానికి కూడా అనుమతి లేదని... దీనిపై తాను అమలాపురం ఎంపీగా ఉన్న సమయంలో అప్పటి ఎమ్మెల్యే పిల్లి సుభాష్‌చంద్రబోసు ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఇది పురావస్తు శాఖ పరిధిలో ఉండడం వల్ల కేంద్రస్థాయిలో కూడా సమస్య పరిష్కారం కాకపోవడంతో. తాను స్వయంగా అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ దృష్టికి తీసుకెళ్లగా... మొదట ఆయన ఆలోచించి తర్వాత అధికారులకు ఆదేశం ఇవ్వడంతో ద్రాక్షారామ నిబంధనలు తొలగించారని, ప్రజలందరికీ మేలు జరిగిందని చెప్పారు.

ఉత్తమ నాయకుడు : ఉండవల్లి

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఉత్తమ నాయకుడు. ఆయన మృతి తీరని లోటు. ఆయనకు ఉత్తమ గతులు ప్రాప్తించుగాక అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్ నివాళి అర్పించారు.



ఎస్.యానాంలో మన్మోహన్‌కు నివాళులర్పిస్తున్న వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారిణులు

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కి నివాళిగా

నేటికి వాయిదా పడిన బీచ్ వాలీబాల్ పోటీలు

ఉప్పలగుప్తం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అస్తమించడంతో ఎస్.యానాంలో శుక్రవారం ప్రారంభం కావలసిన నేషనల్ మహిళా బీచ్ వాలీబాల్ పోటీలను ఒకరోజు వాయిదా వేసినట్టు వాలీబాల్ అసోసియేషన్ ప్రకటించింది. శని, ఆదివారాల్లో ఈ పోటీలను నిర్వహించనున్నట్టు వివరించారు. శుక్రవారం ఎస్.యానాం బీచ్‌లో మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు పలచోళ్ళ పద్మనాభం అధ్యక్షతన సంతాప సమావేశం నిర్వహించారు. ఎనిమిది రాష్ట్రాల నుంచి ఎంతో వ్యయప్రయాసలకోర్చి క్రీడాకారిణులు వచ్చారన్నారు. ఈ కారణంగా పోటీలను కొనసాగించక తప్పడం లేదన్నారు. కార్యక్రమంలో ఆముదా ఛైర్మన్ అల్లాడి స్వామినాయుడు, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు లంకే భీమరాజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, వాటర్ డీసీ ఛైర్మన్ దంగేటి చిట్టిబాబు, కూటమి నాయకులు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, పినిశెట్టి నరసింహారావు, సత్తి చిన్నా, రవణం మధు, టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి గొలకోటి ఫణీంద్రకుమార్, రంకిరెడ్డి కాశీ, వుంద్రు వెంకట మునలయ్య, రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్, వివిధ రాష్ట్రాల క్రీడాకారిణులు పాల్గొన్నారు.

విద్యార్థుల పెన్సిల్ చిత్రాల్లో మన మాజీ ప్రధాని





విద్యార్థులు గీసిన మన్మోహన్‌సింగ్ పెన్సిల్ చిత్రాలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం ఈదరాడ స్కూలుకు చెందిన విద్యార్థులు గీసిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రాలు ఆకట్టుకున్నాయి. ఈదరాడ హైస్కూలులో పదో తరగతి చదువుతున్న డి.అలేఖ్యస్వాతి, యెరుబండి నాగమణికార్తిణి పెన్సిల్‌తో ఈ చిత్రాలను గీశారు. అచ్చుగుద్దినట్టు మన్మోహన్‌సింగ్ చిత్రాలు గీసిన విద్యార్థినులను హెచ్ఎం సాయిబాబు, డ్రాయింగ్ మాస్టారు బత్తుల శ్రీనివాస్ అభినందించారు.

- మామిడికుదురు

ప్రజల పక్షాన సీపీఐ

31 వరకూ సీపీఐ 100వ ఆవిర్భావ దినోత్సవ సభలు
రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ


సభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీపీఐ పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. కార్మికులు, కర్షకులు, అణగారిన వర్గాల తరపున పోరాటం సాగిస్తామని ఆయన వెల్లడించారు. సీపీఐ శత వసంతాల సందర్భంగా శనివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సుబ్రహ్మణ్యమైదానంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. మతతత్వ శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవాలన్నారు. వందేళ్ల భారత దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడుకుంటామని, దాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 31వ తేదీ వరకూ సీపీఐ 100వ ఆవిర్భావ దినోత్సవ సభలు జరుగుతాయని తెలిపారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ ప్రముఖ పాత్ర పోషించిందని ఆయన పేర్కొన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, నగర కార్యదర్శి కొండలరావు, జట్టు లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, జిల్లా కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.


సభకు హాజరైన కార్మికులు

వైసీపీ హయాంలో సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి

రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి


శివకోడులో జరిగిన సభలో మాట్లాడుతున్న శ్రీదేవి

రాజోలు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు రూ.40వేల కోట్లు పక్కదారి పట్టాయని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి ఆరోపించారు. చైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి తొలిసారి జిల్లాకు విచ్చేసిన ఆమెకు ఎన్డీఏ నాయకులు ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల నాయకులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం శివకోడులో శుక్రవారం ఘన స్వాగతం పలికారు. శివకోడులో శ్రీమంగెన గంగయ్య తెలగా కల్యాణ మండపంలో జరిగిన సభలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎస్సీ, ఎస్టీలకు ఎస్సీ కార్పొరేషన్, విదేశీ విద్య వంటి అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ కార్పొరేషన్‌లు ఇచ్చిన దాఖలాలు లేవని ధ్వజమెత్తారు. జగన్ పదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచారని, వైసీపీ విద్యుత్ చార్జీలపై ఆందోళనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ సహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో ప్రస్తుతం అమలవుతున్న ఉన్నతి పథకాలు, త్వరలో అమలయ్యే ఎస్సీ కార్యాచరణ ప్రణాళిక, ఇ-ఆటోలు, షాపింగ్ కాంప్లెక్సులు, పౌల్ట్రీ కాంప్లెక్సులు, ఎన్ఎస్ఎఫ్ డీసీ, ఎన్ఎస్కే ఎఫ్‌డీసీ రికవరీలపై సమీక్ష చేపట్టారు. నిరుపేదలైన ఎస్సీ లబ్ధిదారులకు ఉపాధి కల్పించేందుకు మెరుగైన సేవలు అందించడం ద్వారా పథకాలు అమలు చేయడంలో చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఉన్నతి పథకం ద్వారా కాకినాడ జిల్లాలో 67 మందికి 69.50లక్షలు, తూర్పుగోదావరి జిల్లాలో 74 మందికి రూ.92.50లక్షలు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 89 మందికి రూ.76.50లక్షలతో ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. శ్రీదేవి దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఎమ్మెస్పీ అధికార ప్రతినిధి ఎన్.సత్యనారాయణ, శెట్టెం శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ఎస్సీ డైరెక్టర్లు వల్లూరి రాజా, ఎం.చంద్రశేఖర్, జె.సత్యవతి,కార్పొరేషన్ సిబ్బంది తదితరులున్నారు.

కొల్లూరికి తెలుగు రచయితల మహాసభల ఆహ్వానం


కొల్లూరి

అమలాపురం టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఈనెల28, 29తేదీల్లో విజయవాడ కేబీఎన్ కళాశాలలో జరిగే ఆరవ ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో పాల్గొనేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన ప్రముఖ కవి డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరికి ఆహ్వానం అందింది. 28న పద్మశ్రీ ఆశావాది ప్రకాశరావు సభావేదికపై జరిగే మొదటి కవి సమ్మేళనంలో కొల్లూరి పాల్గొంటారు. గతంలో విజయవాడలో జరిగిన 3, 4, 5 ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో కొల్లూరి పాల్గొనడం విశేషం.

4 నుంచి అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు

అమలాపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): 2025 ఫిబ్రవరి 4 నుంచి 13 వరకు అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు అమలాపురం ఆర్డీవో కె.మాధవి తెలిపారు. ఏర్పాట్లలో భాగంగా జనవరి 2న శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రాంగణంలో జిల్లా స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 7న శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం, 8న రథోత్సవం, 12న స్వామివారి చక్రస్నానం, 13న తెప్పోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆమె పేర్కొన్నారు.

వాహనాలు ఢీకొని యువకుడి మృతి



శంఖవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కత్తిపూడి-నెల్లిపూడి రహదారిలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... ప్రత్తిపాడు మండలం వాకపల్లి గ్రామానికి చెందిన మురుకుర్తి అప్పన్న (30) తన అన్న భార్య మురుకుర్తి రాణిని తీసుకుని బ్యాంకు పనిపై కత్తిపూడి వచ్చాడు. తిరిగి వెళ్తుండగా కత్తిపూడి శివార్లలో ఎదురుగా ఎదురుగా వస్తున్న వాహనం, వీరి వాహనం పరస్పరం ఢీకొన్నాయి. రాణి, అప్పన్నలను స్థానికుల సాయంతో కాకినాడలో ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా అప్పన్న చికిత్స పొందుతూ మృతి చెందాడు. అన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతుడు అప్పన్న (ఫైల్‌ఫొటో)

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తుని రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన కాకినాడ జిల్లా తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం... శుక్రవారం ఉదయం 7.30గంటల సమయంలో తుని ఉల్లిపాడు రైల్వేస్టేషన్ మధ్య సుమారు 35 నుంచి 40 ఏళ్ల కలిగిన వ్యక్తి రైలు నుంచి జారి పడినట్టు గుర్తించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. తెలుపు రంగు ఛాయ కలిగి 5.5అడుగుల ఎత్తు కలిగి ఉన్నాడని, సంబ ంధీకులు ఎవరైనా తుని రైల్వే పోలీస్‌స్టేషన్‌లో కానీ, 9490 619020 నెంబర్లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.


జారిపడిన వ్యక్తి మృతదేహం

ఆత్మహత్యాయత్నానికి నిర్ణయించుకున్న
వివాహితను అడ్డుకున్న హెచ్‌సీ

అన్నవరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం రైల్వే స్టేషన్‌లో పిల్లలతో ఆత్మహత్యాయత్నానికి నిర్ణయించుకున్న వివాహితపై అన్నవరం జీఆర్పీ హెచ్‌సీ శ్యామ్‌కు అనుమానం వచ్చి విచారించడంతో భర్తకు విషయం తెలియపరిచి ఆయనకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.... నక్కపల్లి మండలం నామవరానికి చెందిన కిల్లాడ లోవలక్ష్మి భర్తతో గొడవపడి ఒంటరిగా జీవిస్తోంది. పిల్లలను భర్తకు అప్పగించి ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకుంది. భర్త పిల్లల్ని తీసుకోకపోవడంతో అన్నవరం రైల్వేస్టేషన్ వద్ద అనుమానంగా తిరుగుతోంది. ఆమె గురించి అక్కడ విధుల్లో ఉన్న జీఆర్పీ కానిస్టేబుల్ శ్యామ్ తుని రైల్వే ఎస్ఐకు సమాచారమిచ్చారు. భర్తను రప్పించి కౌన్సిలింగ్ ఇచ్చి భార్య పిల్లల్ని అతడికి అప్పగించారు. శ్యామ్‌ను అక్కడి ప్రయాణికులు అభినందించారు.



వివాహితను భర్తకు అప్పగిస్తున్న హెచ్‌సీ

రూ.16వేలు జరిమానా చెల్లించలేనన్న వ్యక్తికి
ఆరునెలల 15రోజుల జైలుశిక్ష

ఆలమూరు కోర్టులో న్యాయమూర్తి సంచలన తీర్పు

ఆలమూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి సాధారణంగా జరిమానా వేస్తారు. అయితే ఆ జరిమానా చెల్లించలేనని చెప్పడంతో ఓ వ్యక్తికి ఆరు నెలల 15రోజుల జైలు శిక్ష విధిస్తూ ఆలమూరు కోర్టులో శుక్రవారం న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చెముడులంక గ్రామానికి చెందిన కెవీ.వరప్రసాద్ మద్యం తాగి వాహనం నడుపుతుండగా అక్టోబరు 26న ఆలమూరు పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. అయితే అతడు అప్పటి నుంచి కోర్టుకు హాజరు కాకపోకుండా తప్పించుకుతిరుగుతున్నాడు. శుక్రవారం వరప్రసాద్‌ను పట్టుకుని ఆలమూరు కోర్టు న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్ ఎదుట హాజరుపరిచారు. దీంతో రూ.16వేలు జరిమానా చెల్లించాలని తీర్పు చెప్పారు. ఈ తీర్పుపై వరప్రసాద్ మాట్లాడుతూ.. అంతమొత్తం నేను చెల్లించలేనని చెప్పడంతో ఆరునెలల 15 రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి సంచలన తీర్పు చెప్పారు.

జియో.. జీరో!

- ఆనవాలు లేకుండా కొట్టుకొనిపోయిన జియోట్యూబ్
- ఉప్పాడ తీరంలో మాయాపట్నం నుంచి కొత్తపట్నం వరకు జాడలేని వైనం
- కెరటాల రాపిడికి గులకరాళ్లుగా మారిన బండరాళ్లు


సూరాడపేటలో జియోట్యూబ్ నిర్మించిన ప్రాంతం

కొత్తపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సముద్రకోత నుంచి తీరప్రాంత రక్షణకు నిర్మించిన జియో ట్యూబ్‌టెక్నాలజీ నామరూపాలు లేకుండా సముద్రంలో కలిసిపోయింది. తుఫాన్లు, అల్పపీడనాలకు, పౌర్ణమి, సముద్రంలో ప్రతిరోజూ ఏర్పడే పోటు, పాట్లతో కాకినాడ జిల్లాలోని ఉప్పాడ తీర ప్రాంతం క్రమేపీ కోతకు గురవుతూ వస్తోంది. సముద్రకోత నివారణకు పదేళ్ల కిందట ఉప్పాడ శివారు మాయాపట్నం నుంచి కొత్తపట్నం వరకు కిలోమీటరున్నర పొడవునా జియోట్యూబ్ టెక్నాలజీతో రక్షణగోడ నిర్మించారు. సముద్రకోతకు గురయ్యే మాయాపట్నం నుంచి కొత్తపట్నం వరకు ఒడ్డున మొలలోతు కెనాల్ ఏర్పాటు చేశారు. ఆ కెనాల్ కింద నుంచి ఒడ్డుపై నుంచి ఐదు మీటర్ల ఎత్తులో బండరాళ్లను గాబియాన్ సంచుల్లో నింపి రక్షణ గట్టును నిర్మించారు. దీంతో తుఫాన్ల సమయంలో ఉవ్వెత్తున ఎగసిపడే కెరటాలు ఒడ్డును నిర్మించిన గాబియాన్ సంచుల్లో బండరాళ్లను ఢీకొని విడిపోవడంతో కెరటం బలం తగ్గడంతో కోత నివారణ సాధ్యమవుతుందన్న కోణంలో జియోట్యూబ్ నిర్మించారు.


కెరటాల రాపిడికి అరిగిపోయి చిన్న గులకరాళ్లుగా మారిన బండరాళ్లు

కూటమి ప్రభుత్వంపై బాధ్యత

దశాబ్ధకాలంపాటు ఎన్నో తుఫాన్‌లను తట్టుకుని నిలబడిన జియోట్యూబ్ ఇటీవల వరుసగా ఏర్పడిన తుఫాన్‌లు, వాయుగుండాలతో నామరూపాలు లేకుండాపోయింది. ఇది పాడవడానికి సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, తీరప్రాంతాలకు చెందిన ఆకతాయిలు జియోట్యూబ్‌పై ఆడుకుంటూ బ్లేడ్‌లతో గాబిసంచులకు కట్టిన నైలాన్ తాళ్లను కట్ చేయడం ప్రధాన కారణం. ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కోనపాపపేట నుంచి ఉప్పాడ వరకు జియోట్యూబ్ టెక్నాలజీతో రక్షణ కల్పిస్తామని హామీ ఇవ్వడం విధితమే. రక్షణ చర్యలు చేపట్టడం ప్రభుత్వాల బాధ్యత. అదే బాధ్యత సముద్రకోతనుంచి గ్రామాన్ని, ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తున్న టెక్నాలజీని బాధ్యతతో పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని మత్స్యకార పెద్దలు చెబుతున్నారు. జియోట్యూబ్ టెక్నాలజీ ఏర్పాటుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని తీరప్రాంత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి
క్రియ చిన్నారుల పండుగ

జేఎన్‌టీయూకేలో ఏర్పాట్లు, ముఖ్య అతిథిగా డాక్టర్ జయప్రకాశ్ నారాయణ

సర్పవరం జంక్షన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): 11వ రాష్ట్రస్థాయి అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీల క్రియ పిల్లల పండుగ డిసెంబరు 28 నుంచి 29 వరకు రెండురోజుల పాటు కాకినాడ జేఎన్‌టీయూకేలో నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి చిన్నారుల పండుగ ప్రారంభంకానుంది. ముఖ్య అతిథిగా లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ హాజరు కానున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాక తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి ఈ పోటీల్లో పాల్గొనేందుకు సుమారు 10వేలు మంది వరకు విద్యార్థులు హాజరుకావచ్చని నిర్వాహకులు తెలిపారు. 2రోజుల పాటు 28 విభాగాల్లో నిర్వహించనున్న చిన్నారుల పండుగలో తొలి రోజు శనివారం చిన్నారులకు నాటికలు, శాస్త్రీయ నృత్యం, కోలాటం, ఏకపాత్రాభినయం, పాటలు, పోస్టర్ ప్రజెంటేషన్, సైన్ ప్రయోగాలు, గ్రూపు డిబేట్, గణితం, క్విజ్, వ్యాసరచన, కథా రచన, విశ్లేషణ, అంతర్జాలంలో అన్వేషణ జరుగుతాయి. ఆదివారం జానపద నృత్యం (బృందం), విచిత్ర వేషధారణ, బుర్ర కథ, కోలాటం, ప్రాజెక్టు పని, వాద్య సంగీతం, మాటలు, కథ చెప్పడం, స్పెల్లింగ్, చిత్రలేఖనం, సృజనాత్మక వస్తువుల తయారీ, మైమ్, మట్టితో బొమ్మలు వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 5వ తరగతి వరకు సబ్ జూనియర్స్, 6,7 తరగతులు జూనియర్స్ విభాగం.. 8, 9, 10వ తరగతులు సీనియర్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని నిర్వాహకులు చెప్పారు.

ఉప్పాడలో బంగారు రజను వేట


ఉప్పాడలో సముద్రం ఒడ్డున బంగారు రజను సేకరిస్తున్న మహిళలు



కొత్తపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వరుస అల్పపీడనాల అనంతరం ఉప్పాడ తీరంలో బంగారు రజను వేట ప్రారంభమైంది. కెరటాలు సాధారణ స్థాయిలో ఒడ్డుకు రావడం, వెనక్కి వెళ్లడం జరుగుతుంది. అల్పపీడనాలతో ఉప్పొంగిన సముద్ర కెరటాలు ఒడ్డును బలంగా తాకేవి. అప్పట్లో కెరటాల వేగానికి ఒడ్డున నిలబడి ఇసుకలో బంగారు రజను సేకరించడం వీలుపడని కారణంగా గత 2 రోజుల నుంచి మత్స్యకార మహిళలు తీరంలో ఒడ్డున బంగారు రజకు కోసం జల్లెడ పట్టారు. దువ్వెనలు, పలుచని బ్లేడ్ వంటి రేకులతో సముద్రం ఒడ్డున ఇసుకపై రాయడంతో బంగారం రజను తళతళలాడుతూ కనిపిస్తుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మత్స్యకారులు ఒడ్డునే బంగారు రజను కోసం వెతుకుతున్నారు. గత నెలరోజులుగా సముద్రంపై వేటకు వెళ్లని మత్స్యకారులకు రజను వేట కాస్త ఉపశమనం కలిగిస్తోంది.

కానిస్టేబుళ్ల ఎంపిక ఏర్పాట్ల పరిశీలన


పోలీస్ కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్

కాకినాడ క్రైం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) ఈనెల 30 నుంచి నిర్వహించనున్న పోలీస్ కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియకు సంబంధించి దేహదారుఢ్య పరీక్షల ఏర్పాట్లను కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ శుక్రవారం పరిశీలించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరంగా మొత్తం 381 సివిల్ కానిస్టేబుళ్ల ఎంపికకు, ఏపీఎస్పీ ఐఆర్ బెటాలియన్‌లో 630 కానిస్టేబుళ్ల పోస్టుల ఎంపికకు జరుగుతున్న ఈ ప్రక్రియలో వివిధ పరీక్షలకు మొత్తంగా పురుషులు 6,333, మహిళలు 1,449మంది హాజరవుతారని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఏఎస్పీ సుస్మిత, ఏఆర్ అడిషినల్ ఎస్పీ శ్రీనివాస్, ఎస్‌బీ డీఎస్పీ సీహెచ్ శ్రీరామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టుబడ్డ వ్యవహారంలో కేసు నమోదు

కాకినాడ క్రైం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టులోని, లంగరురేవులోని ఓ బార్జిలో పీడీఎస్ బియ్యం పట్టుబడ్డ వ్యవహారంలో కేసు నమోదైంది. ఏపీఐవికె 0073 నెంబరు గల బార్జిలో ఇటీవల 1000 టన్నుల పీడీఎస్ బియ్యం ఉన్నాయన్న పక్కా సమాచారంతో కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాలతో రెవెన్యు, సివిల్ సప్లైస్ అధికారులు యాంకరేజ్ పోర్టులో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. 0073 బార్జిలో 1,064 టన్నులు బియ్యా న్ని ఈనెల 20న స్వాధీనం చేసుకున్నారు. రూ.4.60 కోట్ల విలువైన ఈ బియ్యం కరప మండలం, నడకుదురులో ఉన్న లవణ్ ఇంటర్నేషనల్ సార్టెక్స్ ప్లాంట్ చెందినవిగా గుర్తించారు. అనంతరం ఆ సంస్థ ఎండీ కొట్టారి అమిత్ కుమార్‌జైన్, సంస్థ సూపరివైజర్ గొడితి రవికుమార్‌పై 318 (4), బిఎన్ఎస్ 7 (1) ఈసిఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు సీఐ పి.సునీల్‌కుమార్ తెలిపారు. పోర్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గన్ మిస్ ఫైర్

రిటైర్డ్ మిలటరీ ఉద్యోగికి గాయాలు

నిడదవోలు, డిసెంబరు 27 (ఆంధ్ర జ్యోతి): గన్ మిస్ ఫైర్ అయినా ఘటనలో రిటైర్డ్ మిలటరీ ఉద్యోగి స్వల్ప గాయాల పాలయ్యాడు. నిడదవోలు మండలం కాటకూటేశ్వరం గ్రామానికి చెందిన కారింకి శ్రీనివాస్ మిలట్రీలో పని చేసి రిటైర్డ్ అయ్యారు. ఆయన తన గన్‌ను ప్రతి 6నెలలకోసారి నిడదవోలు సీఐ కార్యాలయానికి తనిఖీ చేయిస్తుంటారు. దీనిలో భాగంగానే గురువారం నిడదవోలు పోలీస్ సర్కిల్ కార్యాలయానికి తన గన్‌ను చెక్ చేయించడానికి తీసుకువచ్చారు. స్టేషన్ బయట కూర్చుని గన్ శుభ్రం చేస్తుండగా ట్రిగ్గర్ వేలికి తగిలి మిస్ ఫైర్ అయినట్టు చెబుతున్నారు. ప్రమాదవశాత్తూ బుల్లెట్ రిలీజై ఆయన బొటన వేలికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రాథమిక చికిత్స చేసి ఇంటికి పంపారు. నిడదవోలు ఎస్ఐ శోభన్‌కుమార్ కేసు నమోదు చేశారు.

పోలవరం సందర్శనకు పార్లమెంట్ కమిటీ

జనవరి 10న రాక..
11న పోలవరం పర్యటన

రాజమహేంద్రవరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పోలవరం సందర్శనకు పార్లమెంట్ కమిటీ హాజరవుతుందని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమన్వయ శాఖల అధికారులతో జేసీ ఎస్.చిన్నరాముడు, ఎస్పీ డి.నరసింహ కిశోర్‌తో కలిసి శుక్రవారం సమీక్షించారు. జనవరి 11వ తేదీన సుమారు 30మంది ఎంపీలతో కూడిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పోలవరం ప్రాజెక్టు సందర్శిస్తుందన్నారు. 10వ తేదీ రాత్రి మధురపూడి విమానాశ్రయానికి కమిటీ సభ్యులు చేరుకుని రాజమహేంద్రవరంలో బస చేస్తారు. 11న ఇక్కడ నుంచి బయలుదేరి పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వెళ్తారని, ఎయిర్ పోర్టు, రాజమహేంద్రవరంలో వారు బస చేసే ప్రాంతంలోనూ కమాండ్ కంట్రోలు రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కమిటీ పర్యటన విజయవంతం కోసం లైజెనింగ్ అధికారులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎంపీల విడిది కేంద్రం వద్ద 24 గంటలూ ఉండే విధంగా అంబులెన్స్ ఏర్పాటు చేయాలన్నారు. 10న రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని టూరిజం, సాంస్కృతిక శాఖ అధికారులకు సూచించారు. గోదావరి హారతికి ఎంపీలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ముందస్తు ఏర్పాట్లు చేయాలని దేవదాయశాఖ అధికారులను ఆదేశించారు. పోలీసు శాఖ బందోబస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్, పోలవరం ప్రాజెక్టు అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ డీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఈదరపల్లిలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

అమలాపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఓపెన్ ర్యాంకింగ్ చదరంగం పోటీలు సాహిత్ అకాడమీ ఆధ్వర్యంలో కోనసీమ జిల్లా చెస్ అసోసియేషన్ సహకారంతో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం ఈదరపల్లిలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి 200 మందికి పైగా చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో వంద మంది వరకు అంతర్జాతీయ రేటింగ్ కలిగిన చెస్ క్రీడాకారులు ఉండడం విశేషం. టోర్నమెంట్‌కు ముఖ్య అతిథులుగా విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పప్పుల శ్రీరామచంద్రమూర్తి, బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి ముషిణి సత్యనారాయణ, ఎన్ఆర్ఐ గుబ్బల నాగేశ్వరరావు హాజరయ్యారు. అండర్-6, 8, 10, 12, 14, అండర్-16 బాలురు, బాలికల విభాగాల వారీగా పోటీలు నిర్వహించి మొదటి 3 స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో విజేతలు జనవరి 17న పెద్దాపురంలో జరిగే నేషనల్ స్కూలు చెస్ టోర్నమెంట్‌కు అర్హత సాధించారని రాష్ట్ర చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కౌరు జగదీష్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఫణికుమార్, కోనసీమ జిల్లా కార్యదర్శి తాడి వెంకటసురేష్, సంయుక్త కార్యదర్శి రాజీవ్ ప్రకటించారు.

పాదగయ ఆదాయం రూ.24.45 లక్షలు

పిఠాపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో హుండీలను శుక్రవారం లెక్కించారు. 72 రోజులకు రూ.24లక్షల 45వేల 110ల ఆదాయం లభించింది. 12.550గ్రాముల బంగారం, 1150 గ్రాముల వెండి వచ్చింది. దేవదాయశాఖ ఆభరణా తనిఖీ అధికారి, అసిస్టెంట్ కమిషనరు వి.పళ్లంరాజు, తనిఖీదారు వి.ఫణికుమార్, ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రమాదపుటంచులు

» దివాన్‌చెరువు- శ్రీరాంపురం రోడ్డులో అస్తవ్యస్తంగా రహదారి అంచులు

» ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



దివాన్‌చెరువు-శ్రీరాంపురం రహదారిలో ప్రమాదకరంగా ఉన్న రోడ్డు అంచు

దివాన్‌చెరువు, డిసెంబరు 27: దివాన్‌చెరువు- శ్రీరాంపురం రోడ్డులో కొంతమేర రహదారి అంచులు సరిగా లేకపోవడంతో పలువురు ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల ఈ రహదారిలో బైక్ అదుపు తప్పి పడిపోయిన సంఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. దివాన్‌చెరువు నుంచి శ్రీరాంపురం వెళ్లే ఆర్‌అండ్‌ బీ రోడ్డులో శ్రీచైతన్య స్కూల్ సమీపంలో కొంతమేర రహదారి ఎడమవైపు రోడ్డు అంచులు దాదాపు అడుగు లోతున ఉన్నాయి. వర్షాలకు మట్టి కొట్టుకుపోవడం వల్లే ఈ ప్రాంతంలో రోడ్డుకు ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు వాపోతున్నారు. ద్విచక్రవాహనాలపై ప్రయాణించే వారెవరైనా ఏ కారణం చేతనైనా రోడ్డు దిగి తిరిగి రహదారి పైకివచ్చే సందర్భాల్లో ఒక్కొక్కసారి ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్ల మెరుగైన నిర్వహణ, రహదారి భద్రతా చర్యల అవసరాన్ని ఈ సంఘటనలు గుర్తుచేస్తున్నాయి. సంబంధిత అధికార్లు తక్షణం స్పందించి సరైన రహదారి నిర్వహణకు చర్యలు తీసుకోవడంతో బాటు ఈ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టడం ద్వారా ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రతీ టీడీపీ కార్యకర్త సేవను గుర్తిస్తాను

కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్



సమావేశంలో మాట్లాడుతున్న నవీన్

గోకవరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం కోసం అహర్నిశలూ శ్రమించిన ప్రతీ కార్యకర్తను తగిన రీతిలో గుర్తిస్తానని టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. మండలంలోని సూదికొండ గ్రామ సమీపంలో శుక్రవారం పార్టీ మండలాధ్యక్షుడు మంగరౌతు రాము అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. అధిక సంఖ్యలో టీడీపీ సభ్యత్వాల నమోదుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో పాటు తన దృష్టికి తీసికొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సమర్థులైన నాయకులను అభ్యర్థులుగా నిలబెట్టి మన సత్తా చాటుదామన్నారు. ఎమ్మెల్యే నెహ్రూ గెలుపు కోసం పాటుపడిన కార్యకర్తలందరికీ భవిష్యత్తులో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. సమావేశంలో పాలూరి బోస్, అడపా భరత్, జనపరెడ్డి సుబ్బారావు, ఉంగరాల రాము, ఎస్వీఎస్ అప్పలరాజు, గాజుంగం సత్తిబాబు, దాసరి తమ్మన్నదొర, బదిరెడ్డి అచ్చన్నదొర, అడపా వెంకట్రావు పాల్గొన్నారు.

'పిడుగు'కు ఐఎంఏ నేషనల్ అప్రిసియేషన్ అవార్డు



రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 27(ఆంధ్ర జ్యోతి): రాజమహేంద్రవరం ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ పిడుగు విజయభాస్కర్ ఐఎంఏ నేషనల్ అప్రిసియేషన్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన ఐఎంఏ నాటకాన్-2024 ఉత్సవ్ కార్యక్రమంలో ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అశోకన్ చేతుల మీదుగా విజయభాస్కర్ అవార్డు అందుకున్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో 1,25,000 మందికి పైగా కంటి ఆపరేషన్లు చేయడంతో పాటు క్రిస్టియన్ మిషనరీ, లయన్స్ హాస్పిటల్స్ కంటి ఆసుపత్రుల ద్వారా పేదలకు, కుష్ఠురోగులకు శస్త్ర చికిత్సలు చేసినందుకు ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా ఆయనకు రాజమహేంద్రవరంలో పలువురు వైద్యులు అభినందనలు తెలిపారు.

మహనీయుడు మన్మోహన్‌సింగ్

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

మాజీ ప్రధాని మృతికి సంతాపం



రామవరంలో మన్మోహన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నల్లమిల్లి

అనపర్తి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక మంత్రిగా తన ఆర్థిక సంస్కరణలతో దేశ భవితను మార్చడమే కాకుండా ప్రధాని పదవికి వన్నె తెచ్చిన మన్మోహన్ సింగ్ చిరస్మరణీయుడని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రామవరంలో ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన మన్‌మోహన్ సింగ్ సంతాప కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాన మంత్రిగా అలుపెరుగని సేవలందిస్తూ దేశానికి సేవలందించారన్నారు. మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరనిలోటని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పల్లె శ్రీనివాసరెడ్డి, కర్రి చిన్నారెడ్డి, మల్లిడి సురేంద్రరెడ్డి, జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కర్రి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సీతానగరం: సీతానగరం బస్టాండ్ సమీపంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు గుండుబోగుల శ్రీనివాస్ (రంగా శ్రీను) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐదేళ్లపాటు ప్రధానిగా ప్రజలకు సేవలందించి దేశ ప్రగతికి పాటుపడిన మహోన్నత వ్యక్తి అని శ్రీనివాస్ కొనియాడారు. కార్యక్రమంలో దుళ్ల సూర్యనారాయణ, మోర్త అబ్బులు, పిర్ల గణేష్, మట్ట రాము, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతి పట్ల రాజమహేంద్రి కళాశాలలో నివాళులర్పించారు. కళాశాల ప్రాంగణంలో మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి విద్యాసంస్థల డైరెక్టర్ తేతలి సత్యసౌందర్య, ప్రిన్సిపాల్ ఎంకేఎస్ ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో డి. వీర వెంకట్రావు, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో మన్మోహన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

దేశానికి తీరనిలోటు

దివాన్‌చెరువు, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆర్థిక సంస్కరణలు అమలు చేయడంలో ముఖ్యభూమిక పోషించిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరనిలోటు అని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బలభద్ర సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో అన్నారు. దేశాన్ని పరిపాలించిన ప్రధానుల్లో మన్మోహన్ ఒకరని, కేంద్ర ఆర్థిక మంత్రిగా, దేశ ప్రధానిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

సీతానగరం ఏవోగా సూర్యరమేష్

సీతానగరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): నవంబర్ నెలలో సస్పెండ్ అయిన మండల వ్యవసాయాధికారి కె.సూర్యరమేష్ శుక్రవారం తిరిగి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గత నెల 26న జిల్లా కలెక్టర్ ప్రశాంతి కొన్ని కారణాలతో ఏవో సూర్యరమేష్‌ను సస్పెండ్ చేశారు. విచారణ అనంతరం సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దుచేయడంతో తిరిగి మండల వ్యవసాయాధికారిగా సూర్యరేమేష్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.

మోస్ట్ అడ్మైర్డ్ అకడమిక్ అడ్వైజర్ అవార్డు గ్రహీతకు సత్కారం



వెంకటరమేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మోస్ట్ అడ్మైర్డ్ అడకమిక్ అడ్వైజర్ అవార్డు గ్రహీత పి.వెంకట రమేష్ ను రాజమహేంద్రవరంలో ఘనంగా సత్కరించారు. స్థానిక మోరంపూడిలోని జూర హోటల్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అనురాగ్ ఐటీ సొల్యూషన్స్ అధినేత ఊబ విద్యాసాగర్, డైరెక్టర్ శ్రీకాంత్ శశి మాట్లాడారు. శ్రీకాకుళానికి చెందిన రమేష్‌కు ఆసియా టుడే మీడియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతిష్టాత్మకమైన మోస్ట్ అడ్మైర్డ్ అకడమిక్ అడ్వైజర్ అవార్డును ఈ నెల 21న హైదరాబాద్‌లోని తాజ్ డెక్కన్‌లో జరిగిన ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డ్స్ 2024 వేడుకల్లో ప్రదానం చేసిందన్నారు. రమేష్ ఆంధ్ర, తెలంగాణతో పాటు 6 రాష్ట్రాల్లో వివిధ ఇంజనీరింగ్ కళాశాలల్లో విశ్వసనీయ సలహాదారుడిగా ముఖ్యపాత్ర పోషించినందుకు ఈ అవార్డును అందించారని తెలిపారు. కార్యక్రమంలో పడల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో వందడుగులు

» అనుసంధాన రహదారిలో వెలగని వీధి దీపాలు

» ఆ దారిలో వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు, వాహనదారులు



చీకట్లో ఉన్న 100 అడుగుల రహదారి

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సిటీ నుంచి రూరల్‌కు అనుసంధానంగా ఉన్న వంద అడుగుల రోడ్డు అంధకారంగా మారింది. ఆవ రోడ్డు నుంచి జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న వంద అడుగుల రహదారిలో రాత్రి వేళల్లో పాదచారులు, వాహనదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారి నుంచి రాజమహేంద్రవరం వచ్చే రహదారుల్లో వంద అడుగుల రహదారి ఇప్పుడు కీలకమైంది. ఈ రహదారిలో రాత్రుళ్లు వెళ్లాలంటేనే ప్రజలు హడలిపోతున్నారు. దీనికి ప్రధాన కారణం వీధి దీపాలు పనిచేయడం లేదు.దీంతో అటుగా రావాలంటేనే భయభ్రాంతులకు గురవుతున్నారు. చుట్టూ ఆవ కాలువలు ఉండడంతో రహదారిపై విషసర్పాలు కూడా సంచరిస్తుండడంతో చాలా ఇబ్బందికరంగా ఉంది. ఈ రహదారి పంచాయతీ పరిధిలో ఉండడం వల్ల కార్పొరేషన్ కూడా పట్టించుకోవడం లేదు. ఇక పంచాయతీ వాళ్లయితే సంబంధం లేనట్టు ఉన్నారు. చీకటిలో సైతం ప్రయాణాలు సాగించేందుకు వీలుగా 100 అడుగుల రోడ్డులో వీధి దీపాలు వెలిగించాలని అధికారులను వేడుకొంటున్నారు.

సర్వేయర్లు బాధ్యతగా వ్యవహరించాలి

» రుడా ఓపెన్ ఫోరంలో వైస్ చైర్మన్ కేతన్ గార్గ్



రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసేటప్పుడు లైసెన్డ్ సర్వేయర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రుడా వైస్ చైర్మన్, మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం రుడా ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా రుడా సిబ్బందితోను, లైసెన్డ్ సర్వేయర్లతో దరఖాస్తుల వారీగా సమీక్షించారు. ప్రతీ దరఖాస్తు నిర్దేశిత సమయంలో అనుమతులు మంజూరు చేయాలన్నారు. సహేతుకంగా లేని కారణాలతో కాలయాపన చేస్తే క్రమ శిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెక్‌లిస్ట్ చూసుకుని దాని ప్రకారం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ విషయంలో ప్రజలకు అసౌకర్యం కలుగకుండా మెలగాలని సూచించారు. అనధికార నిర్మాణాలను గుర్తించిన వెంటనే సంబంధిత వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ కార్యదర్శులు నోటీసులు జారీ చేసి తదుపరి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వైస్ చైర్మన్ ఆదేశించారు. కార్యక్రమంలో సిటీ ప్లానరు జి.కోటయ్య, డిప్యూటీ సిటీ ప్లానర్ సీహెచ్ సత్యనారాయణ రాజు, ప్లానింగ్ ఆఫీసర్ ఎన్.శ్రీనివాస్, లైసెన్డ్ సర్వేయర్లు, అధికారులు, రుడా, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సీతానగరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు పాల్పడిన మిర్తిపాడు గ్రామానికి చెందిన తానారి ప్రభాకరరావు(28) చికిత్స పొందుతూ మృతిచెందినట్టు హెడ్ కానిస్టేబుల్ రేలంగి శ్రీనివాసరావు తెలిపారు. ప్రభాకరరావుకు వివాహం కాలేదు. అప్పులు చేశావేమని కుటుంబ సభ్యులు ప్రశ్నించడంతో మనస్తాపానికి గురై ఈ నెల 1న ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకోగా గమనించిన కుటుంబీకులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మరణించాడని తెలిపారు. తమ్ముడు ఫిర్యాదు, ఆసుపత్రి సమాచారంతో కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సూపర్‌సిక్స్ హామీలను తక్షణమే అమలు చేయాలి

● విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే రాజా ధర్నా



రాజానగరంలో విద్యుత్‌చార్జీలపెంపుపై నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ హామీలను తక్షణమే అమల్లోకి తీసుకురావాలని వైసీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో రాజానగరంలో ధర్నా నిర్వహించారు. స్థానిక వైసీపీ పార్టీ కార్యాలయంలో నుంచి ర్యాలీగా బయలుదేరి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చేరుకుని ధర్నా చేపట్టారు. ఈకార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, నాయకులు ప్రగడ చక్రి, కొల్లి వీర్రాజు, గంగిశెట్టి సోమేశ్వరరావు, మండారపు వీర్రాజుపాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

అనపర్తి: పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం అనపర్తిలో దర్నా, ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా దేవీ చౌక్ నుండి కార్యకర్తలు, నాయకులతో కలిసి ర్యాలీగా దుప్పలపూడిలోని సబ్ స్టేషన్‌కు చేరుకుని కొద్ది సేపు దర్నా నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని విద్యుత్ శాఖ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

చాగల్లు, డిశంబరు 27, (ఆంధ్ర జ్యోతి) మండలంలోని మార్కొండపాడు అంగన్‌వాడి కేంద్రంలలో సెమి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సూపర్‌వైజర్ శిరీషా మాట్లాడుతూ చిన్నారులను ఆటపాటలతో పండుగలను నిర్వహించి ఉల్లాసం, ఉత్సాహం కలిగించేలా చూడాలన్నారు. కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్తలు పుష్పరాజ్యం, జేష్ట, రమాదేవి తదితరులు పాలల్గొన్నారు.

(రాజమహేంద్రవరం)

శ్యామల	: విడుదల-2
సూర్యామినీ	: ముఫాసా
సూర్యాప్యాలస్	: యూఐ
స్వామి	: ముఫాసా
శివజ్యోతి	: పుష్ప-2
అనుశ్రీ(సాయికృష్ణ)	: శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్
రాజా	: పుష్ప-2
ఊర్వశి	: పుష్ప-2, బరోజ్
రంభ	: ముఫాసా
మేనక	: బేబీ జాన్
అప్సర	: పుష్ప-2
కుమారి	: ముఫాసా
అశోక	: బచ్చలమల్లి
వీఎస్ మహాల్(నామవరం)	: పుష్ప-2
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: పుష్ప-2
వెంకటసూర్య(కడియం)	: ముఫాసా, పుష్ప-2
సత్యగౌరి (అనపర్తి)	: పుష్ప-2
సూర్యశ్రీ (అనపర్తి)	: శీకాకుళం షెర్లాక్ హోమ్స్
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: పుష్ప-2
రామకృష్ణ(కోరుకొండ)	: ---
గీతాసినిమాస్ (సీతానగరం)	: పుష్ప-2
శ్రీనివాస (గోకవరం)	: ---
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: పుష్ప-2
లలితామహాల్(రంపచోడవరం)	: పుష్ప-2
నవయుగ(చింతూరు)	: -----

క్రీస్తు బోధనలు అనుసరణీయం: ఎమ్మెల్యే గోరంట్ల



వేమగిరి కొత్తపేట వీధిలో క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వేమగిరి కొత్తపేట వీధిలో రాక్‌యూత్ - రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు కె.ఎస్‌జవహర్‌లు పాల్గొన్నారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్ రెవ. విక్టర్ సునీల్, పాస్టర్ రెవ. సాల్మన్‌రాజు, కోట మధుకుమార్‌లు దేవుని వాక్యసందేశానిచ్చారు. మాజీ సర్పంచ్‌లు డా. వెలుగుబంటి వెంకటాచలం, గుత్తుల హరిప్రసాద్, టీడీపీ రాష్ట్ర నాయకులు మార్గాని సత్యనారాయణ, చెల్లుబోయిన శ్రీను, టూరిజం డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో..

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలోని జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో 15వ యేట క్రిస్మస్ వేడుకలు గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ కేకును రెవరెండ్ ఎం. ఆశీర్వాదం కట్‌చేసి క్రిస్మస్ సందేశాన్ని వినిపించి యూత్ సభ్యులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారుల క్రిస్మస్ వాక్యాలు, డాన్స్‌లు, క్రిస్మస్ తాత వేషధారణ, క్రిస్మస్ ట్రీ, స్టార్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో పాస్టర్లు రెవరెండ్ విజయకుమార్, జాన్, అగస్టీన్‌జాన్ హైడ్, సర్పంచ్ బుంగా రామారావు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కొత్తపల్లి సీయోను చర్చి మరమ్మతులకు లక్ష విరాళం

గోకవరం, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గల సీయోను ప్రార్థనా మందిరం మరమ్మతుల నిమిత్తం లక్ష రూపాయల విరాళాన్ని మాజీ జడ్పీటీసీ సభ్యులు పాలూరి బోస్ అందజేశారుఎ. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగం గా సీయోను ప్రార్థనా మందిరం శిథిలావస్థలో ఉండడాన్ని గమనించిన బోస్ జ్యోతుల నెహ్రూను ఎమ్మెల్యేగా గెలిపిస్తే క్రిస్మస్‌రోజున లక్ష రూపాయలనున విరాళంగా అందజేస్తానని నిర్వాహకులకు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా చర్చికి లక్ష రూపాయల విరాళాన్ని ఈనెల 26న ఆయన అందజేశారు. ఈసందర్భంగా బోస్‌ను చర్చి నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ బోస్

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించండి

● సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో ఝాన్సీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఝాన్సీ

రాజానగరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో నెలకొంటున్న ప్రజా సమస్యల పరిష్కారంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో జేఏ ఝాన్సీ పిలుపునిచ్చారు. రాజానగరం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మండారపు సీతారత్నం అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపుహాల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో తొలుత దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలంటూ సభ్యులు, అధికారులు ఘన నివాళులర్పించి, మౌనం పాటించారు. మండలంలోని వివిధ శాఖల అధికారులతో సమీక్షించి, మన్మోహన్ మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ ఏవిధమైన తీర్మానాలు చేయకుండా సమావేశాన్ని ముగించారు. ఈసమావేశంలో ఎంపీడీవో జేఏ ఝాన్సీ, ఏవో ఎం.సుబ్రహ్మణ్యం, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

థర్మల్ గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి భూముల పరిశీలన



కాపవరంలో జడ్పీ భూములను పరిశీలిస్తున్న జేసీ చినరాముడు

బిక్కవోలు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాపవరం గ్రామంలో థర్మల్ గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి కావల్సిన భూములను శుక్రవారం జాయింట్ కలెక్టర్ చినరాముడు పరిశీలించారు. ఈప్లాంట్ నిర్మాణానికి 11ఎకరాలు అవసరం కాగా గ్రామంలోని 187 సర్వే నెంబరులోని జిల్లా పరిషత్ భూములను ఆయన పరిశీలించారు. ఈప్లాంట్‌లో చెత్త నుంచి థర్మల్ గ్యాస్‌ను తయారుచేస్తారు. జేసీ వెంట ఆర్‌డీఓ కృష్ణనాయక్, బిక్కవోలు తహసీల్దార్ సత్యకృష్ణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన టీడీపీ నాయకులు

కడియం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కడియం మండలం బుర్రిలంక సచివాలయంలో ఉదయం 10..30 సమయం అయినా అధికారులు విధులకు రాకపోవడంపై స్థానిక ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో సచివాలయాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆదేశాను సారం టీడీపీ నాయకులు పర్యవేక్షించారు. టీడీపీ వైద్యవిభాగం రాష్ట్ర నాయకులు డా. గోరంట్ల రవిరామ్‌కిరణ్, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, సర్పంచ్-ఇన్‌చార్జి పాటంశెట్టి రాంజీ, మండల టీడీపీ అధ్యక్షులు వెలుగుబంటి నాని, గట్టి సుబ్బారావులు ఉదయం 9-30కు సచివాలయానికి చేరుకున్నారు. ఉదయం 11 అయినా అధికారులు విధులకు రాకపోవడంపై వివిధ సర్టిఫికెట్లు కోసం వచ్చే ప్రజలు పడే ఇబ్బందులను డా. గోరంట్ల రవిరామ్‌కిరణ్ చూశారు. దీంతో ఎంపీడీవో కె.రమేష్‌కు ఫోను చేశారు. దీంతో సచివాలయానికి చేరుకున్న ఎంపీడీవో రమేష్ సచివాలయ ఉద్యోగులపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చూస్తామని తెలిపారు.

నువ్వే పెంచి..నువ్వే ధర్నా చేయిస్తావా?

● జగన్‌పై మండిపడ్డ టీడీపీ నేత గన్ని కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జగన్ రెడ్డి తుగ్లక్ అని తనకు తానే మరొకసారి రుజువు చేసుకున్నాడని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు అతను చేసిన పాపాలే ప్రస్తుతం ప్రజలకు శాపాలుగా మారాయన్నారు. ఎడాపెడా విద్యుత్ కొనుగోళ్లు జరిపి ఆ భారాన్ని ప్రజలపై వేయాలని వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే జగన్‌రెడ్డి ఈఆర్సీని కోరారని అన్నారు. ఇప్పుడు వాటికి వ్యతిరేకంగా అతని పార్టీ నాయకులతో ధర్నా లు చేయిస్తున్నాడన్నారు. పదిసార్లు 15శాతం విద్యుత్ చార్జీలు పెంచిన ఘనుడు జగన్ అని ప్రజలకు తెలుసు అన్నారు.

హనుమంత వాహనంపై ఊరేగిన వేంకటేశ్వరుడు



బిక్కవోలు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రెండో తూర్పు తిరుమలగా పేరొందిన బలభద్రపురంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ద్వితీయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం మూడో రోజుకు చేరాయి. ఈసందర్భంగా స్వామి అమ్మవార్లకు ఉదయం సుప్రభాత సేవ నిర్వహించి ఆపై పూర్ణాభిషేకం, విశేషోత్సవం, చూర్ణోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. గొల్ల మండపంలో ప్రతిష్ఠ చేసిన అంజనేయస్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిపారు. అనంతరం రాత్రి స్వామి అమ్మవార్లను హనుమంత వాహనంలో ఉంచి మాఢవీధుల గుండా ఊరేగించారు. వచ్చిన భక్తులందరికీ ఆలయ కమిటీ చైర్మన్ మల్లిడి గంగారెడ్డి అన్నప్రసాద వితరణ చేశారు.

వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌ను జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీ లోపల రికార్డులను పరిశీలించారు. లా అండ్ ఆర్డర్ పరిస్థితి, కేసులు నమోదు, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై పలు ఆదేశాలిచ్చారు. స్టేషన్ పరిధిలో పరిస్థితిని సీఐ మురళీకృష్ణ వివరించారు. సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్‌బాబు పాల్గొన్నారు.

112 మద్యం సీసాల స్వాధీనం

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి సిహెచ్ లావణ్య, కాకినాడ ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమీషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం మధ్యాహ్నం సమయంలో రాజమహేంద్రవరం పట్టణంలో ప్రకాష్‌నగర్‌లో డెకాయ్ ఆపరేషన్ నిర్వహించారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకునారు.. వారి వద్ద నుంచి 112 (సుంకం చెల్లించని ఎన్‌డీపీఎల్ లీటర్ల మద్యం సీసాలను)స్వాధీనం చేసుకున్నారు. మద్యం విలువ సుమారు రూ. 4,00,000 ఉంటుందన్నారు. మద్యంతోపాటు ఏక్టివా మోటారుసైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో రాజమహేంద్రవరం ప్రొహిబిషన్ -ఎక్సైజు ఇన్‌స్పెక్టర్ రెడ్డి త్రినాద్, సబ్ ఇన్‌స్పెక్టర్లు జే రామ్ ప్రకాష్, సీహెచ్ రాకేష్ పాల్గొన్నారు.

'ప్రభుత్వ సంక్షేమ పథకాలివ్వండి'

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఎస్సీలకు కేటాయింపులు చేసేటప్పుడు ఎస్సీలో మాదిగ ,59 ఉపకులాలకు జనాభా నిష్పత్తి ప్రకారం న్యాయం చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సీనియర్ నాయకుడు తుత్తరపూడి రమణ మాదిగ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మంత్రి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు లేఖలు పంపిస్తున్నామని శుక్రవారం సిమెంట్రీపేటలో ప్రకటించారు. ఇప్పటి వరకు ఎస్సీ కమిషన్ చైర్మన్లుగా పనిచేసిన వారంతా మాలలే అని ఈదఫా ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా మాదిగలకు అవకాశం ఇవ్వాలని కోరారు.

ఏకసభ్య కమిషన్‌కు వినతి

నిడదవోలు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిడదవోలుకు చెందిన దళిత వర్గాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెట్టే రాజు శుక్రవారం ఏలూరులోని ఏకసభ్య కమిష నర్ రాజీవ్ రంజన్ మిశ్రాను కలిశారు. సుప్రీమ్ కోర్టు ఆదేశాలమేరకు ఎస్సీ వర్గీకరణ అంశంపై ప్రభుత్వం త్వరగా దృష్టి సారించాలని వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు.







ఓ..టర్న్ చేసింది!

రాష్ట్ర గతి మార్చిన.. తూర్పుగోదావరి

ఏడాదికి 365 రోజులు.. నెలలు గడిచాయి.. వారాలు గడిచాయి.. ఇక రోజులే ఉన్నాయి.. అది కూడా 2024లో మిగిలింది మూడు రోజులే.. అంటే 72 గంటల్లో కొత్త ఏడాదిలో అడుగు పెట్టబోతున్నాం.. మరి 2024 ఏం చేసిందో తెలిస్తే.. ఒళ్లు గగుర్పొడుస్తోంది.. ఎందుకంటే చరిత్రకు సాక్ష్యం నిలిచింది.. ఎన్నో సమాధానంలేని ప్రశ్నలకు సమాధానమైంది..?

ఓటు ఏం చేయగలదు.. పచ్చనోటుకు అమ్ముడుపోతోంది.. అదేం చెబితే అదే చేస్తుంది.. పథకాలకు అమ్ముడుపోతోంది.. ఎవరు ఎక్కువ ఇస్తే వారి వైపు ఉంటుంది.. ఇది గత ఎన్నికల ముందు వరకూ ఉన్న అపోహ.. అయితే 2024 మాత్రం ఓటు ఏం చేయగలదో నిరూపించింది.. మరో 30 ఏళ్లు నేనే సీఎం అన్న జగన్‌ను ఎక్కడ కూర్చో పెట్టాలో అక్కడే కూర్చోబెట్టింది.. మాకేంటి అని ఐదేళ్లు విర్రవీగిన నాయకులదీ అదే పరిస్థితి.. ఓటు బలమేంటో చాటిచెప్పింది.. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఐదేళ్ల వైసీపీ అరాచకానికి నిలువునా ఓటుతో పాతరేశారు.. జిల్లా రాజకీయ చరిత్రలో మును పెన్నడూ లేని విధంగా కూటమికి మొత్తం 21కి 21 సీట్లు కట్టబెట్టారు. ఒకరకంగా చెప్పాలంటే 2024 ఏడాది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చేసింది. రాజకీయ స్థితిగతులను మలుపుతిప్పింది. తూర్పు గోదావరి జిల్లాలో 2024 సరికొత్త రాజకీయ ఉదయానికి నాందిపలికింది. పవన్ గాలిలో.. చంద్రుడి వెలుగులో ఫ్యాన్ తునాతునకలైంది.

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

2024.. మరో నాలుగు రోజుల్లో కాలగర్భంలో కలిసిపోతోంది.. మరో కొత్త సంఖ్య కాలగమనంలోకి అడుగుపెట్టబోతోంది.. కానీ గతించిపోతున్న 2024 ఏడాది మాత్రం చరిత్రను తిరగరాసింది. ఓటు విలువ చాటి చెప్పింది.మునుపెన్నడూ లేని విధంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పెను సంచలనాలకు కేంద్రబిందువుగా మారింది. రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేయడంలో కనివినీ ఎరుగని రీతిలో కీలకపాత్ర పోషించింది. రాష్ట్రంలో ఐదేళ్ల అరాచకానికి నిలువెత్తు పాతరవేసింది. తనదైన తీర్పుతో చారిత్రక సాక్ష్యంగా నిలిచింది.

ఓటు ఊచకోత..

2024 ఏడాది అంతా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రంగానే రాష్ట్ర రాజకీయాలు సాగాయి. ఈ సంవత్సరం ఐదేళ్ల వైసీపీ అరాచక ప్రభుత్వానికి పాతరేసేలా అటు ఓటర్లు, ఇటు టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు కలిసికట్టుగా ముందుకు సాగాయి. ప్రత్యర్థి పార్టీలే కాకుండా ఓట్లేసి గద్దెనెక్కించిన ప్రజలను సైతం వైసీపీ తన అహంకార,అరాచక పాలనతో వేధించడంతో ఓటర్లంతా కసిగా నిశ్శబ్ద యుద్ధం సాగించారు. అటు కూటమి పార్టీలు సైతం విభేదాలకు తావులేకుండా కలిసికట్టుగా ముందుకు సాగి చరిత్ర ఎరుగని భారీ విజయం సాధించాయి. వాస్తవానికి 2024, మేలో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది జనవరి నుంచే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకరేపాయి. ఈ ఏడాది జనవరి 26న పవన్ పొత్తులో భాగంగా తొలి జాబితా ప్రకటించారు. రాజానగరం, రాజోలు నియోజకవర్గాల్లో జనసేన పోటీ చేస్తుందని రాష్ట్రంలోనే తొలి రెండు సీట్లను ప్రకటించి వైసీపీపై రాజకీయ యుద్ధానికి నాంది పలికారు. అదేనెలలో టీడీపీ అధినేత చంద్రబాబు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎన్నికల శంఖారావం పూరించారు. ఉమ్మడి జిల్లాలో తునిలో ఏ పార్టీ విజయం సాధిస్తే ఆపార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందన్న సెంటిమెంట్‌కు కొనసాగింపు అన్నట్టు జనవరి 10న తుని నుంచి రా..కదలి రా..సభతో చంద్రబాబు తన ఎన్నికల శంఖారావం పూరించారు. జనవరి 23నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా అనేక నియోజకవర్గాల్లో చంద్రబాబు సతీమణి భువనేశ్వరి సుడిగాలి పర్యటనలతో ప్రచార స్పీడు పెంచారు. మరోపక్క జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిఠాపురం నుంచే పోటీ చేస్తున్నట్టు మార్చి 14న ప్రకటించారు. అప్పటినుంచి రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టి జిల్లాపైనే పడింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 19 అసెంబ్లీ సీట్లలో ఒక్కస్థానం కూడా వైసీపీకి రాకుండా చేసే బాధ్యత తనదని పవన్ కల్యాణ్ ప్రకటించడంతో రాజకీయ వేడి మరింత పెరిగింది. మార్చి 16న అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్, ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వెలువడడంతో ఉమ్మడి జిల్లాలో రాజకీయ కాక పెరిగిపోయింది. కూటమిలో ఏప్రిల్ రెండో వారం నాటికి అభ్యర్థుల లెక్క తేల్చేసి ఎన్నికల బరిలోకి దిగాయి. ఒకపక్క టీడీపీ అధినేత చంద్రబాబు.. మరో పక్క జనసేన అధినేత పవన్.. ఇంకోపక్క బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సుడిగాలి పర్యటనలతో హోరెత్తించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కూటమి సునామీ స్పీడుతో ఎన్నికల రణక్షేత్రంలో కదిలి జనచైతన్యాన్ని పెంచాయి.

ఫ్యాన్ రెక్కలు ముక్కలు..

ఐదేళ్ల అరాచకంతో విర్రవీగిన వైసీపీ ఈ ఏడాది జనవరి నుంచే జిల్లాలో చేదు జ్ఞాపకాలను మూటగట్టుకుంది. కాకినాడలో అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి నుంచి ఈ చివర తునిలో మంత్రి దాడిశెట్టి రాజా, రాజమహేంద్రవరంలో మంత్రి వేణు.. ఇలా ఒకరేంటి ఎవరికివారే ఐదేళ్ల అధికారం మత్తులో జిల్లాను జుర్రేశారు. వీరందరికి తోడు ఎంపీ మిథున్‌రెడ్డి కడప నుంచి వచ్చి జిల్లాపై సాగించిన పెత్తనం, అక్రమాలు,దందాలు, స్కామ్‌లు జిల్లా ప్రజల్లో వైసీపీపై అసహ్యం పుట్టించేలా చేశాయి.అప్పటికే పన్నుల మోత, ఛార్జీల వాత,రీసర్వే పేరుతో భూముల్లో మతలబులు, ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌తో ప్రజల ఆస్తులను లూటీచేసే ప్రయత్నాలతో ప్రజల్లో వైసీపీపై తీవ్ర వ్యతిరేకత పెంచేసింది.దీంతో కాకినాడలో జనవరి 3న జగన్ పర్యటించిన సమయంలోను ప్రజలెవరూ రాకుండా ఆ పార్టీ ఓటమిని ముందే ఖాయం చేసేశారు. ఆ తర్వాత ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత పేరుతో వారిని మార్చి కొత్తవారిని నిలబెట్టినా జనం ఆదరించలేదు. చివరకు పిఠాపురంలో పవన్‌ను ఓడించేందుకు అప్పటికప్పుడు ముద్రగడను పార్టీలోకి చేర్చుకోవడం, కడప నుంచి మిథున్‌రెడ్డి మనుషులను,వందలకోట్ల డబ్బును పంచినా ప్రజల ఛీత్కారం నుంచి వైసీపీ తప్పించుకోలేక పోయింది. చివరకు ముద్ర గడను సొంతకూతురే ఛీల్చిచెండాడడంతో వైసీపీ మరింత పలుచన అయిపోయింది. చివరకు ఎన్నికల ఫలితాలతో ఫ్యాన్ రెక్కలు ముక్కలు ముక్కలయ్యాయి.అధికారం కోల్పోయిన తర్వాత వైసీపీకి క్యాడర్ కూడా ముఖం చాటేయడంతో 2024 ఆపార్టీకి పీడకలగా మారినట్లయింది.

ముద్రగడ పద్మనాభరెడ్డిగా.. ముద్రగడ పద్మనాభం

- 2024 ఎన్నికల్లో చిత్రవిచిత్రాలు జరిగాయి.. ఈ ఎన్నికల్లో ప్రధాన ఆకర్షణ ముద్రగడ పద్మనాభం. ఎన్నికల్లో వైసీపీ గెలవకపోతే పేరు మార్చుకుంటానని శపథం చేశారు. ఈ ఎన్నికలో ఘోరంగా ఓటమి పాలవడంతో ఆయన తన పేరును ముద్రగడ పద్మనాభరెడ్డిగా మార్చుకున్నారు.
- పి.గన్నవరంలో కూటమి అభ్యర్థిగా టీడీపీనుంచి మహాసేన రాజేష్‌ను ప్రకటించారు. కానీ కొన్ని కారణాల వల్ల ఆయన స్వచ్ఛందంగా టిక్కెట్ వదులుకున్నారు. పోలీస్ విభాగంలో పనిచేసిన గిడ్డి సత్యనారాయణ జనసేన తరఫున అనూహ్యంగా ఆ టిక్కెట్ అందుకుని విజయం సాధించారు.
- ఎన్నికల ముందు వరకూ జనసేనలో ఉన్న పితాని బాలకృష్ణ, శెట్టిబత్తుల రాజబాబు, డీఎంఆర్ శేఖర్, టీడీపీలో ఉన్న గొల్లపల్లి సూర్యారావు ఎన్నికల ముందు వైసీపీలో చేరారు.
- మునిసిపల్ కౌన్సిలర్ కుమారుడైన సుభాష్ అనూహ్యంగా రామచంద్రపురం టిక్కెట్ దక్కించుకున్నారు. ఎమ్మెల్యేగా విజయం సాధించి మంత్రి అయ్యారు.
- వైసీపీ ప్రభుత్వంలో రామచంద్రపురం, కొవ్వూరు నుంచి మంత్రులుగా కొనసాగిన చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, తానేటి వనిత వారు పనిచేసిన నియోజకవర్గాల్లో కాకుండా రాజమహేంద్రవరం, గోపాలపురం నియోజకవర్గాల్లో పోటీచేసి ఓటమి పాలయ్యారు.

- మార్పు తెచ్చిన 'తూర్పు'తీర్పు
- 2024లో రాజకీయ సంచలనం
- కూటమికి మద్దతుగా ఓటర్లు
- అన్ని స్థానాల్లో క్లీన్‌స్వీప్
- 21 స్థానాల్లోను అఖండ విజయం
- వైసీపీకి వాతపెట్టిన జనం
- పిఠాపురం నుంచి బరిలో పవన్
- రాజమండ్రి నుంచి పురందేశ్వరి
- రాష్ట్రవ్యాప్తంగా మార్మోగిన జిల్లా
- చంద్రబాబు.. మోదీ ప్రచారం
- ఓటు సంవత్సరంగా 2024



అరాచకాన్ని అదిమిపట్టి.. ఓటుతో తొక్కేశారు!

మే 14న అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా అప్పటికే కూటమికి అధికారం కట్టబెట్టడానికి సిద్ధపడ్డ ఓటర్లు కనివినీ ఎరుగని రీతిలో పోలింగ్ బూత్‌లకు పోటెత్తారు.పోలింగ్ సమయం ముగిసినా సరే కదలకుండా అర్ధరాత్రి పన్నెండు దాటినా ఓట్లు వేసి తీరాలనే కసితో బారులు తీరారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఓటర్ల పట్టుదల రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చేశాయి. జూన్ 4న వెల్లడైన ఫలితాల్లో ఓటర్ల సునామీ తీర్పును కళ్లకు కట్టాయి. ఈ ఫలితాల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 19 అసెంబ్లీ స్థానాలతో పాటు రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం పరిధిలోని రెండు సీట్లు కలిపి మొత్తం 21 స్థానాల్లో కూటమి పార్టీ విజయం సాధించింది. అసలు ఒక్కటంటే ఒక్క సీటు కూడా అధికార వైసీపీ గెలవలేదు.ఐదేళ్ల పాటు అధికారాన్ని అడ్డంపెట్టుకుని విర్రవీగి ఉమ్మడి జిల్లాను అన్ని విధాలా లూటీచేసిన వైసీపీ నేతలను ప్రజలు ఈడ్చికొట్టారు. చెంప చెళ్లుమనే తీర్పునిచ్చి పాతాళానికి తొక్కేశారు.కూటమిలో ఒక్కో ఎమ్మెల్యేకు రికార్డుస్థాయి మెజార్టీ కట్టబెట్టారు.

పదవులు వరించెన్

ఈ ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొందరిని అనూహ్యంగా ఉన్నత పదవులు వరించాయి.కొత్తవారికి మంత్రి పదవులు దక్కగా ఆయా పార్టీలకు విధేయులుగా ఉంటూ కూటమి గెలుపునకు కృషి చేసిన వారికి నామినేటెడ్ పోస్టులు లభించాయి. ఉమ్మడి జిల్లా నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిఠాపురం నుంచి భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచి డిప్యూటీ సీఎం అయ్యారు. పలు కీలక శాఖలకు మంత్రిగా వ్యవహరిస్తున్నారు. నిడదవోలు నుంచి జనసేన తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన కందుల దుర్గేశ్ పర్యాటక శాఖ మంత్రి అయ్యారు. రామచంద్రపురం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన వాసంశెట్టి సుభాష్ సామాజిక సమీకరణల్లో భాగంగా అనూహ్యంగా మంత్రి పదవి దక్కించుకున్నారు. టీటీడీ బోర్డు మెంబర్లుగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, సీతానగరం మండలం రఘుదేవపురానికి చెందిన పారిశ్రామికవేత్త అక్కిన మునికోటేశ్వరరావు ఎంపికయ్యారు. కౌడా చైర్మన్‌గా పెద్దాపురం జనసేన ఇన్‌చార్జి తుమ్మలబాబు, రుడా చైర్మన్‌గా బీవీఆర్ చౌదరి, ఆడా చైర్మన్‌గా ఎ.స్వామి నాయుడు, సివిల్ సప్లైస్ చైర్మన్‌గా జనసేన కాకినాడ నగర అధ్యక్షుడు తోట సుధీర్, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్‌గా కుడుపూడి సత్తిబాబు ఇంకా చాలామంది నాయకులు ఆయా కార్పొరేషన్లకు డైరెక్టర్లుగా ఎంపిక య్యారు. తుని ఎమ్మెల్యే యనమల దివ్య, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబులను ప్రభుత్వ విప్‌లుగా నియమించారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్‌గా, సీఎం ప్రోగ్రాం కమిటీ చైర్మన్‌గాఉన్న టీడీపీ సీనియర్ నేత పెందుర్తి వెంకటేశ్‌కు కేబినెట్ హోదా కల్పించారు. ఇలా జిల్లాకు చెందిన పలువుర్ని పదవులు వరించాయి.



మన్మోహన్ సింగ్ మృతికి కలెక్టర్ సంతాపం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపట్ల జిల్లా కలెక్టర్ పి . ప్రశాంతి సంతాపం ప్రకటించారు. కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం మన్మోహన్ సింగ్ మృతి పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించారు. మన్మోహన్ సింగ్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ మాజీ ప్రధాని మనోహ్మన్ సింగ్ మృతి నేపథ్యంలో ఏడు రోజులు సంతాప దినాలుగా పాటించడం జరుగుతుందని చెప్పారు.

టీడీపీ సభ్యత్వాల నమోదులో గోపాలపురం ఫస్ట్

నల్లజర్ల,డిశంబరు27(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వాల నమోదులో జిల్లాలోనే గోపాలపురం నియోజకవర్గం ప్రథమస్థానంలో నిలిచినట్టు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు తెలిపారు.నల్లజర్ల పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ నిర్ధేశించిన 60వేల సభ్యత్వాలు పైబడి నియోజకవర్గంలో నమోదు చేయించామని చెప్పారు.టీడీపీ పట్ల ప్రజల్లో మరింత విశ్వాసం ఉందని నిరూపించినట్టు పేర్కొన్నారు. కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి విజయ సంకేతం తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్,యద్దనపూడి బ్రహ్మారాజు,ద్వారకాతిరుమ అధ్యక్షుడు లంకా సత్యనారాయణ,నాయకులు కూచిపూడి ఉదయ భాస్కరరావు పాల్గొన్నారు

ఇసుక రీచ్ నిర్వాహకులదే పర్యవేక్షణ బాధ్యత

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇసుక రీచ్ నిర్వాహకులదే పర్యవేక్షణ బాధ్యత అని.. అక్రమ రవాణా చేస్తున్నవారిపై కేసులు వారే పెట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన ఇసుక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 17 ఓపెన్ రీచ్‌లలో 1,46,249 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉండగా ఇప్పటి వరకూ 47,755 మెట్రిక్ టన్నులు వినియోగించారన్నారు.మిగిలిన ఇసుక ఎంత ఉందో ఇరిగేషన్,మైన్స్, రెవెన్యూ, అధికారులు జాయింట్ యాక్షన్ పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. చిడిపి -1, కాకరపర్రు-1, కుమారుదేవం 1,3, ములకల్లంక-1,2, కాటవరం ఓపెన్ రీచ్‌లలో నీరు ఉండడంపై జాయింట్ కమిటీ తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలన్నారు. డీసిల్టేషన్ ఎగువ ప్రాంతంలో ఇసుకతీతకు బోట్స్‌మన్ సొసైటీలకు ముందస్తు అనుమతులు ఎందుకు ఇచ్చారో వివరణ ఇవ్వాలని ఇరిగేషన్ హెడ్‌వర్క్స్ ఈఈని ఆదేశించారు. దీనిపై ఉన్నత స్థాయి అధికారులకు నివేదిక పంపిస్తామని స్పష్టం చేశారు.పట్టా భూముల్లో 30 దరఖాస్తులకు ఎన్‌వోసీ జారీ చేశామన్నారు. జిల్లాలో కొత్తగా ఆరు ఓపెన్ రీచ్‌లను గుర్తించామని, వాటిని జీయో గ్రాఫికల్ సంఖ్య ఆధారంగా అందుబాటులోకి తేవాలన్నారు. సమావేశంలో జేసీ చిన్నరాముడు, ఏఎస్పీ మురళీకృష్ణ, ఆర్డీవోలు పాల్గొన్నారు.



పండక్కి.. ఫుల్‌గా

- కొత్త ఏడాది ఆర్టీసీకి 'పెద్ద పండుగ'
- డౌన్‌లో 88 స్పెషల్ బస్సులు
- సాధారణ చార్జీలే అమలు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు ఫుల్ అయింది. పెద్ద పండగ సంక్రాంతి సందర్భంగా రిజర్వేషన్ టిక్కెట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. హైదరాబాద్ నుంచి తూర్పుగోదావరి జిల్లాకు మొత్తం 88 స్పెషల్ బస్సులు వేసినా వాటిలోనూ టిక్కెట్లు అయిపోయాయి.దీంతో మరిన్ని స్పెషల్ బస్సులు ఏర్పాటు చేయాలనే డిమాండ్ పెరుగుతోంది. షెడ్యూలు సర్వీసులు, స్పెషల్ బస్సులన్నీ నిండిపోవడంతో జనవరి 9, 10, 11, 12, 13 తేదీల్లో హైదరాబాద్ నుంచి జిల్లాకు వచ్చే సర్వీసులకు రిజర్వేషన్ కౌంటర్ క్లోజ్ చేసేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పెద్ద పండక్కి మూడు వారాల ముందే టిక్కెట్లన్నీ బుక్ కావడం ఆర్టీసీ అధికారులు,ఉద్యోగుల్లో ఆశ్చర్యం కల్గిస్తోంది.షెడ్యూలు బస్సులతో పాటు స్పెషల్ బస్సుల్లోనూ టిక్కెటు రేట్లు పెంచలేదు.సాధారణ ఛార్జీలనే వసూలు చేస్తున్నారు.

జిల్లా నుంచి 88 స్పెషల్స్ ..

పెద్ద పండక్కి జిల్లా నుంచి హైదరాబాద్ వెళ్లే వారికంటే అక్కడి నుంచి వచ్చే వారే ఎక్కువ. ఈ మేరకు ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాటు చేసింది. జనవరి 9, 10, 11, 12, 13 తేదీల్లో హైదరాబాద్ నుంచి జిల్లాకు ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడుపుతోంది. ఈ బస్సులన్నీ ముందు రోజు ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లి ఆయా రోజుల్లో ప్రయాణీకులతో తిరిగి చేరుకుంటాయి. జిల్లాలోని రాజమహేంద్రవరం, నిడదవోలు, కొవ్వూరు, గోకవరం డిపోల నుంచి సూపర్ లగ్జరీ, ఆల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ స్పెషల్ బస్సులు నడుపుతున్నారు. ఇవన్నీ పెద్దపండక్కి హైదరాబాద్ నుంచి జిల్లాకు వచ్చే ప్రయాణీకుల కోసం (డౌన్‌లో) ఏర్పాటు చేశారు. 9వ తేదీన గోకవరం డిపో నుంచి ఒక ఎక్స్‌ప్రెస్ సర్వీసు, 10న ఐదు, 11న నాలుగు, 12న ఐదు, 13న ఒకటి ఎక్స్‌ప్రెస్ సర్వీసులను నడుపుతున్నారు. కొవ్వూరు డిపో నుంచి 9వ తేదీన మూడు సూపర్ లగ్జరీ, 10న మూడు సూపర్ లగ్జరీ, ఒక ఎక్స్‌ప్రెస్, 11న మూడు సూపర్ లగ్జరీ, ఒక ఎక్స్‌ప్రెస్, 12న మూడు సూపర్ లగ్జరీ, ఒక ఎక్స్‌ప్రెస్, 13న ఒక సూపర్ లగ్జరీ సర్వీసు నడుపుతున్నారు. నిడదవోలు డిపో నుంచి 9వ తేదీన రెండు సూపర్ లగ్జరీ, 10న రెండు సూపర్ లగ్జరీ, 11న రెండు సూపర్ లగ్జరీ, 12న రెండు సూపర్ లగ్జరీ, 13న ఒక ఎక్స్‌ప్రెస్ సర్వీసు నడుపుతున్నారు. ఇక రాజమహేంద్రవరం డిపో నుంచి 9వ తేదీన నాలుగు సూపర్ లగ్జరీ, రెండు ఆల్ట్రా డీలక్స్, 10న ఏడు సూపర్ లగ్జరీ, నాలుగు ఆల్ట్రా డీలక్స్, మూడు ఎక్స్‌ప్రెస్, 11న ఆరు సూపర్ లగ్జరీ, నాలుగు ఆల్ట్రా డీలక్స్, రెండు ఎక్స్‌ప్రెస్, 12న ఏడు సూపర్ లగ్జరీ, నాలుగు ఆల్ట్రా డీలక్స్, మూడు ఎక్స్‌ప్రెస్, 13న ఒక సూపర్ లగ్జరీ సర్వీసు నడుపుతున్నారు. ఇలా గోకవరం డిపో నుంచి 16 సర్వీసులు, కొవ్వూరు డిపో నుంచి 16 సర్వీసులు, నిడదవోలు డిపో నుంచి 9 సర్వీసులు, రాజమహేంద్రవరం డిపో నుంచి 47 సర్వీసులు స్పెషల్స్ నిర్వహిస్తున్నారు. రాజమహేంద్రవరం నుంచి విజయవాడ, విశాఖపట్నంతో పాటు కాకినాడ వంటి ప్రాంతాలకు స్పెషల్ సర్వీసులు నడపాలని భావిస్తున్నా ముందస్తు రిజర్వేషన్ సదుపాయం లేదు.

విద్యుత్ చార్జీల పెంపుపై వైసీపీ నిరసన



వినతిపత్రం అందజేస్తున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు వేణు, మాజీ ఎంపీ భరత్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల అదనపు భారాలను ప్రజల మోపుతున్న కూటమి ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తున్నామని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ అన్నారు. విద్యుత్ అదనపు చార్జీలను వ్యతిరేకిస్తూ శుక్రవారం కోటిపల్లి బస్టాండ్ నుంచి నిరసన బైక్ ర్యాలీ చేశారు. గోదావరి బండ్ రోడ్డులోని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేశారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందించారు. నిరసనలో మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్, రుడా మాజీ చైర్మన్ మేడపాటి షర్మిళారెడ్డి, వైసీపీ నాయకులు గిరిజాలబాబు, గుర్రం గౌత మ్, నక్కా శ్రీనగేష్, సంకిస భవాని ప్రియ, పోలు విజయలక్ష్మి, మార్తి లక్ష్మి పాల్గొన్నారు.

నిడదవోలు మాజీ ఎమ్మెల్యే జీఎస్ నాయుడు గైర్హాజరు

నిడదవోలు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీల అదనపు భారాన్ని తగ్గించాలని కోరుతూ శుక్రవారం నిడదవోలులో వైసీపీ ర్యాలీ, ధర్నా నిర్వహించింది.ఈ ఆందోళనకు నిడదవోలు మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు గైర్హాజరయ్యారు.పార్టీ పిలుపు ఇచ్చినా ఆయన కార్యక్రమాల్లో పాల్గొనక పోవడంపై పార్టీ శ్రేణుల్లో ఏవో గుసుగుసలు వినిపిస్తున్నాయి. పార్టీలోని ఒక వర్గం మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు తండ్రి మాజీ ఎమ్మెల్యే జీ.ఎస్.రావు అనారోగ్యంతో ఉన్న కారణంగా రాలేకపోయారని చెబుతున్నారు.అదే పార్టీలోని మరొకవర్గం ఆయన పార్టీ మారే ఆలోచనతోనే కాస్త దూరంగా ఉం టున్నారని చెప్పుకుంటున్నారు.ఈ కారణంతోనే నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల్లో రాజమండ్రి పార్లమెంటు ఇన్‌చార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పాల్గొంటున్నారనే చర్చ సాగుతోంది. శుక్ర వారం జరిగిన విద్యుత్ ధర్నా కూడా ఆయన ఆధ్వర్యంలోనే జరగడం అనుమానాలకు తావిస్తోంది.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

నాడే చార్జీలు పెంచేసి.. నేడు ధర్నాలా!

అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జగన్ సీఎంగా ఉండగా పెంచిన విద్యుత్ చార్జీలపై ఇప్పుడు ధర్నాలు చేయాలని పిలుపునిచ్చిన మాజీ ముఖ్యమంత్రిది తుగ్లక్ చర్య కాక మరేమిటని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. వైసీపీ నాయకులు విద్యుత్ చార్జీలపై నిరసన కార్యక్రమాలు చేపట్టంపై శుక్రవారం ఆయన తన కార్యాలయంలో స్పందించారు.గత పాలకులు ఇచ్చిన ఆదేశాలు ఇప్పుడు అమలవుతున్నాయి తప్ప కూటమి ప్రభుత్వం ఏమి పెంచలేదన్నారు. విద్యుత్ చార్జీల పాపం నాటి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.ఈఆర్‌సి ఆదేశాలు 2021-24కు ఏవిధంగా ఉన్నాయన్న విష యం ప్రజలకు తెలియాలన్నారు. 2021-22కి ఏపి ఈఆర్‌సీ ట్రూఆఫ్ చార్జీలు అప్రూవ్ చేసింది 3082 కోట్లు, 2022-23కి 6073కోట్లు 2023-24కి 11000 కోట్లు మొత్తం దాదాపు 22 వేల కోట్ల భారం ప్రజలపై మోపార న్నారు.ఈ చార్జీలు 2024 డిసెంబరు నుంచి అమలు చేయాలని ఆనాడు జగన్ ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ పాపం ఎవరిదో నేడు ధర్నాలు చేస్తున్న నాయకులు చెప్పాలని అన్నారు. 2014లో లోటు విద్యుత్ బడ్జెట్‌తో రాష్ట్రం ఏర్పడితే 2019 నాటికి సీఎం చంద్రబాబు మిగులు బడ్జెట్ రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు. అధికారం చేపట్టిన జగన్‌రెడ్డి జెన్‌కో ట్రాన్స్‌కోలను సర్వనాశనం చేశాడన్నారు.సమావేశంలో ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ సుధాకరరెడ్డి, నాయకులు సత్తి దేవదానరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి,తాడి గంగిరెడ్డి,ప్రసాదరెడ్డి,సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

బ్యాంకర్లు రుణాల లక్ష్యం చేరాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 27 (ఆంధ్ర జ్యోతి): బ్యాంకర్లు రుణాలు మంజూరులో ఉదారంగా వ్యవహరించాలని కలెక్టర్ ప్రశాంతి సూచించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన బ్యాంకర్లతో సమీక్షించారు.2024-25 త్రైమాసిక ప్రణాళిక అమలు పురోగతి, వ్యవసాయ అనుబంధ రుణ ప్రణాళిక ప్రగతి విద్యా రుణాలు, టిడ్కో ఇంటి రుణాలు, వికసిత్ భారత్ , విశ్వకర్మ యోజన, కేంద్ర ప్రభుత్వ పథకాలకు బ్యాంకు రుణాలు తదితర అంశాలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో రైతులకు రుణ ప్రణాళికలో భాగంగా స్వల్ప కాలిక, టర్మ్ లోన్లు మొత్తం 11,106 లక్ష్యంకాగా 7201 మందికి రుణాలు మంజూరు చేశామన్నారు. కౌలు రైతులు 30,179 మందికి సుమారు రూ.150.5 కోట్లు రుణాలు అందజేశాన్నారు.20,515 డ్వాక్రా సంఘాలకు రూ. 1,421.56 కోట్ల లక్ష్యానికి 9478 గ్రూపులకు రూ. 592 కోట్లు (41.71)ధాతం మంజూరు చేసినట్టు చెప్పారు. నూతన పాలసీ ప్రకారం ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. లక్ష్యాలు సాధించని బ్యాంకర్లపై సీఈవోకి ఫిర్యాదు చేయడం జరుగుతుందన్నారు. నెల రోజుల అనంతరం బ్యాంకుల ప్రగతి నివేదిక ఆధారంగా తదుపరి కార్యాచరణ ఉంటుందన్నారు డీసీసీబీ, యుకో, కొటక్ తదితర బ్యాంకుల లక్ష్య సాధనలో వెనుకబాటుపై వివరణ కోరారు. రానున్న డిసిసి సమావేశానికి ముఖ్యఅధికారులు హాజరు కావాలన్నారు. సమావేశానికి హాజరైన వారికి సరైన అవగాహన లేకపోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీసీ కన్వీనర్, డీజీఎం ఎ.విశ్వేశ్వరరావు, నాబార్డు ఏజీఎం వైఎస్ నాయుడు, ఆర్బీఐ ప్రతినిధి సీహెచ్.నవీన్ కుమార్, ఇతర జిల్లా అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.



బ్యాంకర్లతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

8 రిటైర్డ్ మిలటరీ ఉద్యోగి గన్ మిస్ ఫైర్
పశువుల అక్రమ రవాణా ఐదుగురిపై కేసు నమోదు
జనవరి 11న పోలవరానికి పార్లమెంట్ కమిటీ - లోపలి పేజీలో

వన్‌టౌన్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌ను జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీ లోప ల రికార్డులను పరిశీలించారు. లా అండ్ ఆర్డర్ పరిస్థితి, కేసులు నమోదు, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై పలు ఆదేశాలిచ్చారు. స్టేషన్ పరిధిలో పరిస్థితిని సీఐ మురళీకృష్ణ వివరించారు.

నేడు కొవ్వూరు కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన శనివారం నిర్వహిస్తున్నట్టు కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. పట్టణంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి అంశాలపై చర్చిస్తామని, 23 వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు.

గన్ మిస్ ఫైర్

రిటైర్డ్ మిలటరీ ఉద్యోగికి స్వల్పగాయాలు

నిడదవోలు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గన్ మిస్ ఫైర్ అయినా ఘటనలో రిటైర్డ్ మిలటరీ ఉద్యోగి స్వల్పగాయాలపాలయ్యాడు. నిడదవోలు మండలం కాటకూటేశ్వరం గ్రామానికి చెందిన కారింకి శ్రీనివాస్ మిలట్రీలో పని చేసి రిటైర్డ్ అయ్యారు. ఆయన తన గన్‌ను ప్రతి ఆరు నెలలకోసారి నిడదవోలు సీఐ కార్యాలయానికి తనిఖీ చేయిస్తుంటారు. దీనిలో భాగంగానే గురువారం నిడదవోలు పోలీస్ సర్కిల్ కార్యాలయానికి తన గన్‌ను చెక్ చేయించడానికి తీసుకువచ్చారు. స్టేషన్ బయటకూర్చుని గన్ శుభ్రం చేస్తుండగా ట్రిగ్గర్ వేలికి తగిలి మిస్ ఫైర్ అయినట్టు చెబుతున్నారు. ప్రమాదవశాత్తూ బుల్లెట్ రిలీజ్ అయ్యి ఆయన బొటన వేలికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో అతడికి ప్రాథమిక చికిత్స చేసి ఇంటికి పంపారు. ఈ మేరకు నిడదవోలు టౌన్ ఎస్‌ఐ శోభన్ కుమార్ కేసు నమోదు చేశారు.

పశువుల అక్రమ రవాణా

ఐదుగురిపై కేసు

కొవ్వూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పశువుల అక్రమ రవాణా చేస్తున్న ఐదుగురిపై కేసునమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. శుక్రవారం జాతీయ రహదారి-16పై విజయవాడ వైపు కంటైనర్‌లో అక్రమంగా పశువులను తరలిస్తున్నారని సమాచారం రావడంతో శుక్రవారం కొవ్వూరు గామన్ బ్రిడ్జి టోల్ గేటు వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో వ్యాన్‌లో అనకాపల్లి జిల్లా గుల్లేపల్లికి చెందిన గాలి రవి, చౌడువాడ శివ, చౌడువాడ రమేష్, వరద గ్రామానికి చెందిన దొగ్గ శివ, గవరవరం గ్రామానికి చెందిన తొత్తారి నాగేంద్ర పాడేరు శాండీ మార్కెట్‌లో 7 ఎద్దులను ఎక్కించుకుని హనుమాన్ జంక్షన్‌కు తరలిస్తున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి ఐదుగురిపై కేసునమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

చాగల్లు, డిశంబరు 27 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని మార్కొండపాడు అంగన్‌వాడి కేంద్రంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సూపర్‌వైజర్ శిరీషా మాట్లాడుతూ చిన్నారులను ఆటపాటలతో పండుగలను నిర్వహించి ఉల్లాసం, ఉత్సాహం కలిగించేలా చూడాలన్నారు. కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పుష్పరాజ్యం, జేష్ఠ రమాదేవి తదితరులు పాలల్గొన్నారు.

'ఆదరణ'లో క్రిస్మస్ సంబరాలు

కొవ్వూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం దొమ్మేరు ఆదరణ అంధుల ఆశ్రమంలో క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు అక్కాబత్తుల జాన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ కేక్‌ను టీడీపీ నాయకుడు యలమర్తి శ్రీరాంప్రసాద్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. క్యాండిల్ సర్వీస్ చేశారు. అక్కాబత్తుల క్రిస్టియన్ దేవానంద్ పాల్ క్రిస్మస్ సందేశాన్ని అందజేశారు. జాన్ సోదరుడు గోపాలరావు జ్ఞాపకార్థం వృద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేవీకే రంగారావు, గారపాటి రామకృష్ణ, పెండ్యాల బాబూరావు, భుజంగం, జుజ్జవరపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కిషోర బాలికల వ్యక్తిత్వ

వికాసంపై అవగాహన



చాగల్లు, డిశంబరు 27, (ఆంధ్ర జ్యోతి): కిషోర బాలికల వ్యక్తిత్వ వికాసం, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో ఆర్.శ్రీదేవి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కిషోర బాలిక వికాస్ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రతి వారు విద్యావంతులు కావాలని, సామాజిక బాగస్వామ్యం పెంచేలా చూడాలన్నారు. జీవన విధానంలో నైపుణ్యం పెంచేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి శ్రవణ్‌కుమార్, ఎంఈవో సుభాకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడి సిబ్బంది, ఏఎన్‌ఎంలు, మహిళ పోలీసులు, స్కూల్ టీచర్లు పాల్గొన్నారు.

దేశ సంప్రదాయాల్లో సంక్రాంతి ప్రత్యేకం

- ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు
- నియోజకవర్గ స్థాయి సంక్రాంతి సంబరాల నిర్వహణ కమిటీతో సమావేశం
- క్రీడా పోటీల మైదానం పరిశీలన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి సంప్రదాయంలో సంక్రాంతి పండుగకు ప్రత్యేక స్థానం ఉందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని వేళ్ల చింతలగూడెం గ్రామంలో ఈ ఏడాది నిర్వహించే నియోజకవర్గ స్థాయి సంక్రాంతి సంబరాల నిర్వహణ కమిటీతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. గ్రామానికి చెందిన ఆర్ అండ్‌ఎం ఫౌండేషన్ చైర్మన్ గంటా మధుకృష్ణ నివాసం వద్ద జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావి తరాలకు చాటి చెప్పడంతో పాటు తెలుగుదనం ఉట్టిపడే విధంగా ఈ ఏడాది నియోజకవర్గ స్థాయిలో పలురకాల క్రీడలు, ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సంబరాల ముగింపు కార్యక్రమం జనవరి 17వ తేదీ సాయంత్రం జరుగుతుందన్నారు. కార్యక్రమాలను అధికారులు, నాయకులు, గ్రామస్థులు సమన్వయంతో నిర్వహించాలన్నారు. అనంతరం వివిధ క్రీడలు ఆడేందుకు ఏర్పాటు చేసిన మైదానాన్ని అధికారులు, నాయకులు సంక్రాంతి సంబ రాల కమిటీ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.అజయ్‌బాబు, ఎంపీడీవో టీఎస్ఎస్ శ్రీనివాస్, సీఐ బి.నాగేశ్వర్ నాయక్, ఎస్‌ఐ కె.సతీష్‌కుమార్, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముమ్మిడి సత్యనారాయణ, టీడీపీ మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ, వడ్ల మూడి రమేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రకృతి పంటలతో ఆరోగ్యం

దేవరపల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగాయిగూడెం, చిన్నాయిగూడెం గ్రామాల్లో అంగన్వాడీ సెంటర్ల నుంచి ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆకుకూరలను గర్భిణులకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహం అందజేస్తోందని, ఇంటి పెరటిలో ఆకు, కాయగూరలు పండించేందుకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేస్తోందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో నాగలక్ష్మి, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఎం.రాణి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి బాధాకరం

మాజీ ఎమ్మెల్యే తలారి



మన్మోహన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి

కొవ్వూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, ఆర్థికవేత్త మన్మోహన్‌సింగ్ మృతి బాధాకరమని మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. శుక్రవారం కొవ్వూరు విజయవిహార్ సెంటర్‌లో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి తలారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణప్రసాద్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికి ప్రధానిగా చక్కటి పాలనను అందించిన మన్మోహన్‌సింగ్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కంటమణి రమేష్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు మన్నె పద్మ, గండ్రోతు అంజలి, రుత్తల భాస్కరరావు, కవల నాగేశ్వరరావు, చౌటిపల్లి వీరన్న, తోట రామకృష్ణ, పోసిన శ్రీలేఖ పాల్గొన్నారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పెనుమాక జయరాజు మాట్లాడుతూ రెండుసార్లు ప్రధానిగా, ఆర్థిక మంత్రిగా దేశానికి సేవలందించిన మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇచ్చి గౌరవించాలన్నారు. ఆయన దేశాన్ని ప్రగతి పథంలో నడిపించిన గొప్ప ఆర్థికవేత్త అని అన్నారు. మన్మోహన్ మృతికి సంతాపం తెలిపారు.

తాళ్లపూడి: తాళ్లపూడిలో తహశీల్దార్ అధ్యక్షతన సంతాపసభ నిర్వహించారు. మన్మోహన్‌సింగ్ నిరాడంబర జీవితానికి ఉదాహరణ అని, సంస్కరణల సారథి అని తహశీల్దార్ అన్నారు. ఏఎస్‌వో జోడాల మాట్లాడుతూ దేశ ఆర్థిక మంత్రిగా, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, ప్రధాన మంత్రిగా విశిష్ఠ సేవలందించి దేశానికి వేతన ఆర్థిక సంస్కరణలు చేసిన మహానుభావుడని అన్నారు. కార్యక్రమంలో డీటీ భారతి, ఆర్‌ఐ రామకృష్ణ, సర్వేయర్ సత్యనారాయణ, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఆర్‌పై ప్రతిఒక్కరికి అవగాహన అవసరం



దేవరపల్లిలో సీపీఆర్ విధానాన్ని వివరిస్తున్న డాక్టర్ సుమంత్

దేవరపల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): బ్యాంకులు వ్యాపార అభివృద్ధితో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని దేవరపల్లి మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి డాక్టర్ కే.సుమంత్ అన్నారు. పోస్టల్ బ్యాంకు రజతోత్సవంలో భాగంగా శుక్రవారం దేవరపల్లిలో బ్యాంకు ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు సుమంత్ తదితర డాక్టర్లు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుమంత్ మాట్లాడుతూ ఎవరైనా స్పృహ కోల్పోతే కార్డియక్ అరెస్ట్ జరిగి ఉండవచ్చని ముందుగా సీపీఆర్ చేయాలన్నారు. ప్రతిఒక్కరు దీనిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాంకు మేనేజర్ కే.శ్రీనివాస్ మాట్లాడుతూ దేవరపల్లిలో పోస్టల్ బ్యాంకు 2011లో స్థాపించామని 10 వేల మంది ఖాతాదారులకు సేవలందిస్తున్నామన్నారు. తమ బ్యాంకు ఏర్పాటు చేసి 25ఏళ్లు పూర్తయ్యాయని, రాష్ట్రంలో 50బ్రాంచ్‌లు ఉన్నాయన్నారు. వజ్రోత్సవ కేకును కట్ చేశారు. అనంతరం బ్యాంక్ ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో బళ్ళా సూర్యచక్రం, కాట్రు భీమరాజు, కేసిరాజు రాజ్‌కుమార్, దాసరి శేషారావు, యలమాటి సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని వైసీపీ పోరుబాట



కొవ్వూరులో నిరసన తెలుపుతున్న వైసీపీ నాయకులు

కొవ్వూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపును కూటమి ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు డిమాండ్ చేశారు. వైసీపీ పోరుబాటలో భాగంగా కరెంటు చార్జీలను తగ్గించాలని నిరసిస్తూ శుక్రవారం కొవ్వూరులోని విజయవిహార్ సెంటర్ నుంచి విద్యుత్‌శాఖ ఏడీ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తలారి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలను పెంచబోమని ప్రజలను నమ్మించి మోసం చేశారన్నారు. తప్పుడు హామీలతో గద్దెనెక్కి కరెంటు చార్జీలు పెంపుతో ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం గృహ వినియోగదారులపై మోపిన రూ. 15,485.36 కోట్ల చార్జీలను తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. సామాన్య ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం గడిచిన ఆరు నెలల కాలంలో రెండు సార్లు రెండు సార్లు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై మోయలేని భారం మోపిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, కంటమణి రమేష్, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు మన్నె పద్మ, గండ్రోతు అంజలి, రుత్తల బాస్కరరావు, కవల నాగేశ్వరరావు, చౌటిపల్లి వీరన్న, తోట రామకృష్ణ, పోసిన శ్రీలేఖ, చిట్టూరి అన్నవరం, వేండ్ర సూరిబాబు పాల్గొన్నారు.

గోపాలపురం: నియోజకవర్గ ముఖ్య కేంద్రంలో చేపట్టిన పోరుబాట కార్యక్రమానికి స్పందన కరువైంది. కార్యకర్తల నుంచి సరైన స్పందన లేకపోవడంతో హాజరైన కొద్ది మందితో చెక్ పోస్టు సెంటర్ నుంచి సబ్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో నాలుగు మండలాలు ఉండగా దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాల నుంచి ఆశించిన స్థాయిలో కార్యకర్తలు రాలేదు. గోపాలపురం మండలం నుంచి హాజరైన కొద్ది మంది కార్యకర్తలతో మాజీ మంత్రి తానేటి వనిత పోరుబాట కార్యక్రమం నిర్వహించారు.

సీతానగరం ఏవోగా సూర్యరమేష్

సీతానగరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): నవంబర్ నెలలో సస్పెండ్ అయిన మండల వ్యవసాయాధికారి కె.సూర్యరమేష్ శుక్రవారం తిరిగి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గత నెల 26న జిల్లా కలెక్టర్ ప్రశాంతి కొన్ని కారణాలతో ఏవో సూర్యరమేష్‌ను సస్పెండ్ చేశారు. విచారణ అనంతరం సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దుచేయడంతో తిరిగి మండల వ్యవసాయాధికారిగా సూర్యరమేష్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.

ప్రజలపై మోయలేని ప్రభుత్వ భారాలు

సీపీఎం జిల్లా కార్యదర్శి అరుణ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి అరుణ్

కొవ్వూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ప్రజలపై మోయలేని భారాలు మోపుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. శుక్రవారం కొవ్వూరులోని పార్టీ కార్యాలయంలో బీరా రవి అధ్యక్షతన సమావేశంలో ఈ నెల 28,29 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరిగే సీపీఎం జిల్లా 24వ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని చెప్పి నేడు 2019లో వాడుకున్న, చెల్లించిన బిల్లులకు మరలా సర్దుబాటు చార్జీలు, ట్రూఅప్ చార్జీలు అంటూ భారాలు వేసి, సరిపోవన్నట్టు ప్రతి ఇంటికి ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించి వినియోగదారుడి ఆ ఖర్చును మూడేళ్ల వసూలు చేస్తామని చెప్పడాన్ని విమర్శించారు. కేంద్రం నుంచి నిధులు రాబట్టకుండా ప్రజలపై భారాలు మోపడం ఏమిటన్నారు. జిల్లా కమిటీ సభ్యుడు జువ్వల రాంబాబు మాట్లాడుతూ 28వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు మునిసిపల్ స్టేడియం నుంచి కోటిపల్లి బస్టాండ్ వరకు ప్రజా ప్రదర్శన, 3గంటలకు కోటిపల్లి బస్టాండ్ సెంటర్‌లో బహిరంగ సభ జరుగుతాయన్నారు. 29న జరిగే ప్రతినిధుల సభకు జిల్లాలోని అన్ని మండలాల ప్రతినిధులు హాజరుకావాలన్నారు. మూడేళ్లుగా చేపట్టిన ప్రజాపోరాటాలపై సమీక్షించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు ఏరియా నూతన కమిటీ కన్వీనర్‌గా ఎం.సుందరబాబు, మరో ఆరుగురిని సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

స్త్రీ, పురుష సమానత్వానికి ఉద్యమించాలి

పీవోడబ్ల్యు జిల్లా కార్యదర్శి మల్లిక



పీవోడబ్ల్యు మహాసభలో పాల్గొన్న మహిళలు

కొవ్వూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్త్రీ, పురుష సమానత్వంకై మహిళలు ఉద్యమించాలని ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యు) జిల్లా కార్యదర్శి ఈమని మల్లిక అన్నారు. కొవ్వూరు 19వ వార్డులో శుక్రవారం నిర్వహించిన మహాసభలో ఆమె మాట్లాడుతూ మనువాద భావజాల పార్టీల్లో మహిళలపై రోజురోజుకు హింస పెరుగుతుందన్నారు. స్త్రీలు పనిచేసే ప్రాంతాల్లో రక్షణగా ప్రత్యేక దళాలను ఏర్పాటుచేయాలన్నారు. రాష్ట్రంలో మద్యపానాన్ని, అశ్లీల సాహిత్యాన్ని, పోర్న్ వెబ్‌సైట్‌లను నిషేధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణాల్లో మహిళలకు కుటీర పరిశ్రమలు ఏర్పాటుచేసి ఉపాధి కల్పించాలి. స్త్రీల విద్యను ప్రోత్సహించేందుకు వయోజన విద్యా కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ మహిళలు న్యాయం కోసం సామాజిక పోరాటాలతో పాటు చట్టాలను, కోర్టులను ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పి.నాగమణి, ఉపాధ్యక్షురాలిగా బి.కృష్ణవేణి, ప్రధాన కార్యదర్శిగా ఎం.సత్యవతి, కార్యదర్శిగా కె.హరిత, కోశాధికారిగా జి.పార్వతి, మరో ఆరుగురిని సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గాన్ని మందపాటి లక్ష్మి, చీర అప్పారావు, శ్రీను, మహ ర్షి, మనీందర్, ఏఎంసీ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటరత్నం అభినందించారు.

రీసర్వేలో అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

రెవెన్యూ సదస్సులో చీపురుగూడెం గ్రామస్థులు



చీపురుగూడెంలో అధికారులకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

నల్లజర్ల, డిశంబరు 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన రీసర్వే అవకతవకలపై చర్యలు తీసుకుని తమకు పాత వెబ్‌ల్యాండ్ ప్రకారం ఉన్న భూములు అన్‌లైన్‌లో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని చీపురుగూడెం రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామంలో వీఆర్వో సునీత ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతులు తమ సమస్యలను ఇన్‌చార్జి తహశీల్దార్ ఎస్‌వీఎస్ నాయుడికి వివరించారు. రీసర్వేలో తమ భూములు అన్‌లైన్‌లో కనిపించడం లేదని, దీని ద్వారా తమకు బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలు రావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. తప్పులు సరిచేయాలని చెప్పినా ఇప్పటి వరకు చేయలేదన్నారు. కార్యక్రమంలో చెల్లు పెద్దరామన్న, కూసంపూడి వెంకటేశ్వరరావు(బుజ్జి), చెల్లు సుబ్రహ్మణ్యం, చెల్లు వీరవెంకట్రావు, కంపన దుర్గారావు, మోహన్, చెల్లు సత్యనారాయణ పాల్గొన్నారు.

దేవరపల్లి: త్యాజంపూడి గ్రామ సచివాయలం వద్ద రెవెన్యూ సదస్సు జరిగింది. ముందుగా గ్రామంలోని దళిత వాడల్లో తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి, సిబ్బందితో పర్యటించి సమ స్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవచ్చునన్నారు. అనంతరం జరిగిన సదస్సులో రైతులు, గ్రామస్థులు తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేశారు. రెవెన్యూ సదస్సు ద్వారా వచ్చిన పిర్యాదులను వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ శ్రీనివాస్, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.



త్యాజంపూడిలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న తహశీల్దార్ రాజ్యలక్ష్మి

ప్రభుత్వాసుపత్రిలో కాపర్ పైపుల

చోరీపై విచారణ



ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిని విచారిస్తున్న ఏఎస్‌ఐ ప్రకాష్

కొవ్వూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో దొంగలు పడి కాపర్ పైపులు దొంగిలించుకుపోయారు. ఆసుపత్రి పైఅంతస్తులో ఆక్సిజన్ ప్లాంట్ నుంచి ఆపరేషన్ థియేటర్‌కు, వార్డులకు, కారిడార్ ద్వారా ఆక్సిజన్‌ను సరఫరా చేసే కాపర్ పైపులను దుండగులు ఈ నెల 25న దొంగిలించుకుపోయారు. ఈ విషయాన్ని ఆసుపత్రి డిప్యూటీ సివిల్ సర్జన్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డి.సత్యకుమారి ఉన్నతాధికారులకు సమాచారం అందించి, వారి ఆదేశాలతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్‌ఐ జీజీ ప్రకాష్ ఆసుపత్రికి చేరుకుని వైద్యులు, సిబ్బందిని నుంచి వివరాలు సేకరించారు. ఆసుపత్రిలోని ఆక్సిజన్ ప్లాంట్ తాళాలు వేసినవి వేసినట్లే ఉన్నాయి. ప్లాంట్‌కు ఉన్న సుమారు 3.5లక్షలు 420 అడుగుల కాపర్ పైపులను కట్ చేసి దొంగిలించుకుపోయారు. దీనిపై సీఐ పి.విశ్వం కేసు నమోదు చేశారు.

గోపాల ప్రభువు నిర్యాణం



కొవ్వూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాద క్షేత్రంలోని గీతమందిరం స్వామిజీ త్రిదండి స్వామి భక్తి హృదయ న్యాసి మహరాజ్ (గోపాల ప్రభువు) శుక్రవారం ఉదయం నిర్యాణం చెందారు. కొవ్వూరు, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో చేరుకుని గోపాల ప్రభువు పార్థీవ దేహాన్ని సందర్శించారు. ఆయన భౌతిక కాయానికి మందిరం పరిసర ప్రాంతంలో అంత్యక్రియలు నిర్వహించారు.

లూయిస్ పాశ్చర్ జయంతి

కొవ్వూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఏబీఎన్, సీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో లూయిస్ పాశ్చర్ జయంతిని శుక్రవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎం.రామ్మోహన్ ఆధ్వర్యంలో లైఫ్ సైన్సెస్ విద్యార్థులు పాశ్చర్ చిత్రపటానికి నివాళులర్పించారు. రామ్మోహన్ మాట్లాడుతూ పాశ్చర్ అంటువ్యాధులకు రోగ నిరోధక టీకాలకు ఆద్యుడన్నారు. రాబిస్‌కు మందును, పాశ్చరైజేషన్ ప్రక్రియను,ఆంత్రాక్స్ వ్యాక్సిన్ తయారీని, ఫెర్మంటేషన్ ప్రక్రియను కనుగొన్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ యల్లాప్రగడ రమేష్, మాధురిదేవి, కె.సురేష్ బాబు, టి.శశికళ, బి.రత్నదీపిక, ఎ.మల్లిక తదితరులు పాల్గొన్నారు.

ఏకసభ్య కమిషన్‌కు వినతి

నిడదవోలు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిడదవోలుకు చెందిన దళిత వర్గాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెట్టే రాజు శుక్రవారం ఏలూరులోని ఏకసభ్య కమిషనర్ రాజీవ్ రంజన్ మిశ్రాను కలిశారు. సుప్రీమ్ కోర్టు ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణ అంశంపై ప్రభుత్వం త్వరగా దృష్టి సారించాలని వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు.

టీబీ వ్యాధిగ్రస్థులకు కిట్లు

నిడదవోలు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధిగ్రస్థులకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఫయాజ్ అన్నారు. శుక్రవారం నిడదవోలులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో టీబీ వ్యాధిగ్రస్థులకు రీచ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఫయాజ్ మాట్లాడుతూ టీబీ వ్యాధిగ్రస్థులు క్రమం తప్పకుండా మందులు వాడడం ద్వారా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పూర్తి ఆరోగ్యవంతులు కావచ్చునని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రీచ్ ప్రాజెక్ట్ ప్రతినిధులు వర్మ, రాంబాబు, ఎస్‌టీఎస్ పోతురాజు, రాజ్‌కుమార్, సమీర్, ఫార్మాసిస్ట్ పావని పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

తాళ్లపూడి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మానవత సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 28న తాళ్లపూడిలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని రాజమహేంద్రవరం జీఎస్‌ఎల్ హాస్పిటల్‌కు చెందిన 30మంది వైద్యులతో నిర్వహిస్తున్నట్టు సంస్థ అధ్యక్షుడు అంకెం సురేష్‌కుమార్ తెలిపారు. ఈ శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తామన్నారు. ఈ శిబిరం పోస్టరును సంస్థ చైర్మన్ సింహాద్రి జనార్ధనరావు ఆవిష్కరించారు.

నేడు ఉండ్రాజవరం మండల

పరిషత్ సమావేశం

ఉండ్రాజవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 28వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో వీఎస్ రామారావు తెలిపారు. ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలన్నారు.

మామిడితోటకు సస్యరక్షణ చర్యలు అవసరం

రైతులకు అవగాహన కార్యక్రమంలో ఉద్యాన అధికారిణి బబిత



సదస్సులో మాట్లాడుతున్న ఉద్యాన శాఖాధికారిణి బబిత

నల్లజర్ల, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి) మామిడితోటకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని నల్లజర్ల ఉద్యాన అధికారిణి బబిత అన్నారు. శుక్రవారం నల్లజర్ల రైతు భరోసా కేంద్రం వద్ద మామిడి రైతులకు మామిడితోటకు వచ్చే తెగుళ్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మామిడితోటలు పూమొగ్గ దశ, పచ్చి పూత దశ,పూత దశలో ఉన్నాయని, వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల రసం పీల్చే పురుగుల ఉధృతి, తెగుళ్ల సోకే అవకాశం ఉందన్నారు. పచ్చి పూత దశలో ఉంటే తేనే మంచు పురుగు, పక్షికన్ను తెగులు, బూడిద తెగులు ఆశిస్తాయన్నారు. వాటి నివారణకు థయామిథాక్సమ్ 0.3గ్రాములు, హెక్సాకోనజోల్ 2మీ.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పూమొగ్గ దశలో ఉంటే ఇమిడాక్లోపిడ్ 0.3 మి.లీ, క్లోరోథలోనిల్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి చెట్టు ఆకులు,కాండంపై పిచికారీ చేయాలన్నారు. తోటకు నీరు పెట్టడం నిలిపి వేయాలని చెప్పారు.

ఏకసభ్య కమిషన్‌కు రాజ్యాంగబద్ధ అనుమతి లేదు

మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాష్



ఏకసభ్య కమిషన్‌కు వినతిపత్రం అందిస్తున్న నల్లజర్ల నాయకులు

కొవ్వూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణపై ఏర్పాటుచేసిన రాజీవ్ రంగరాజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్‌కు మాలల తరపున వాదనలు వినిపించినట్లు మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాష్ తెలిపారు. శుక్రవారం ఏలూరులో కమిషన్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. శ్యాం రవిప్రకాష్ మాట్లాడుతూ ఈ కమిషన్‌కు రాజ్యాంగ బద్ధ అనుమతి లేదని, ఆర్టికల్ 338(9) ప్రకారం చెల్లదన్నారు. ఎస్సీలను వర్గీకరణ చేసే అధికారం పార్లమెంటుకు గాని, సుప్రీంకోర్టుకు గాని లేదని, రాజకీయ లబ్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నం చేయడం దుర్మార్గపు ఆలోచన అన్నారు. కార్యక్రమంలో మాసా ఆనంద్, మెండెం సంతోష్‌కుమార్, గంటా సుందరకుమార్, చీకటిమిల్లి మంగరాజు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని మాల సంఘాల నాయకులు ఉన్నారు.

నల్లజర్ల: ఎస్సీ వర్గీకరణ ఏవిధంగా చేయాలని దానిపై ప్రభుత్వం ఏక సభ్య కమిషన్ ఏర్పాటు చేయడంతో శుక్రవారం ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజాన్ మిశ్రా తన బృందంతో ఏలూరులో సమావేశం ఏర్పాటు చేశారు. నల్లజర్ల మండలం నుంచి ఎస్సీ వర్గీరకణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు వెళ్లి వర్గీకరణకు వ్యతిరేకంగా వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గుదే సుబ్బారావు, వడ్డీ శ్రీను, గుదే శ్రీనివాసరావు, గుజ్జుల రమేష్, గారపాటి సురేష్ ఉన్నారు.

రాష్ట్రం యూనిట్‌గా వర్గీకరణ చేయాలి

చాగల్లు, డిశంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీల వర్గీకరణ జిల్లా యూనిట్‌గా కాకుండా రాష్ట్రం యూనిట్‌గా చేయాలని ఎస్సీ వర్గీకరణ జేఏసీ నాయకులు జె.వరప్రసాద్ కోరారు. ఏలూరు విచ్చేసిన ఏకసభ్య కమిటీ కమీషనర్ రాజీవ్ రంజన్ మిశ్రాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉప కులాలకు న్యాయం జరిగేలా వర్గీకరణను వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు పాలల్గొన్నారు.